నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 15-8-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:12 | పేజీలు: 4 | వెల: రూ.1/-

బస్తీ దవాఖానాను ప్రారంభించేందుకు హబ్సీగూడకు వచ్చిన సందర్భంగా స్థానికులకు అభివాదం చేస్తున్న మంత్రి కెటిఆర్

ప్రజలకు మెరుగైన వైద్యం కోసం కృషి

బస్తీ దవాఖానాలతో ఎక్కడిక్కడే వైద్యం
నగరంలో పలుచోట్ల ప్రారంభించిన మంత్రులు

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): బస్తీల్లోని పేదలకు మెరుగైన ప్రాథమిక వైద్యం అందించేందుకే ప్రభుత్వం బస్తీ దవాఖానలను ఏర్పాటు చేస్తోందని ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. శుక్రవారం హబ్సిగూడలోని రాంరెడ్డినగర్‌లో జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డితో కలిసి బస్తీ దవాఖానను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య తెలంగాణ సాధననే లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రజల ఇంటి వద్దకే మెరుగైన వైద్యం అందించాలన్నది సీఎం కేసీఆర్ సంకల్పమని చెప్పారు. నగరంలో పలు చోట్ల బస్తీ దవాఖానాలను మంత్రి కేటీఆర్‌తో పాటు మంత్రులు దవాఖానాలను శుక్రవారం ప్రారంభించారు. గ్రేటర్ పరిధిలో మొత్తం 165 బస్తీ దవాఖానాలను ప్రారంభించాలని నిర్ణయించారు. 14వేల మందికి వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం వాటిని ప్రారంభించింది. ముందుగా రామంతపూర్, రామిరెడ్డి నగర్‌లో మంత్రి కేటీఆర్ బస్తీ దవాఖానా ప్రారంభించారు. అదేవిధంగా రాంగోపాలపేట డివిజన్‌లోని నల్లగుట్టలో పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ బస్తీ దవాఖానను ప్రారంభించగా.. గాంధీనగర్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, ముఠా గోపాల్ ప్రారంభించారు. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 165 దవాఖానలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా ఇవాళ 25 దవాఖానలను ప్రారంభించింది.

ప్రతి వార్డుకు రెండు దవాఖానల చొప్పున 300 దవాఖాలను ఏర్పాటు చేస్తామని మంత్రులు పేర్కొన్నారు.

ముస్తాబైన ఢిల్లీ ఎర్రకోట

తక్కువ సంఖ్యలో అతిథులకు ఆహ్వానం

న్యూఢిల్లీ,ఆగస్ట్ 14(ఆర్ఎన్ఎ): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఢిల్లీలోని ఎర్రకోట ముస్తాబైంది. ఎర్రకోట పరిసర ప్రాంతాలన్నీ పోలీస్ వలయంలో ఉన్నాయి. ఇప్పటికే రిహార్సల్ చేశారు. అందరినీ కలుపుకుని 5వేల మందికి ఏర్పాట్లు చేశారు. కరోనా కారణంగా సామాజిక దూరం పాటించే విధంగా కుర్చీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఢిల్లీ పోలీసులు, కేంద్రపారామిలటరీ బలగాలతో ఎర్రకోట ప్రాంతమంతా జల్లెడపడుతున్నారు. శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోటపైనుంచి జాతీయ జెండా ఎగురవేస్తారు. ప్రధాని ప్రసంగించే వేదిక చుట్టూ బు÷-లలెట్ ప్రూఫ్ ఏర్పాటు చేశారు. తక్కువ సంఖ్యలో ఆహులతుకు ఆహ్వానాలు అందించారు.

విషమంగానే ప్రణబ్ ఆరోగ్యం

వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్న ఆర్మీ డాక్టర్లు
కోలుకుంటారన్న ఆశ వ్యక్తం చేసిన షర్మిష్ట

న్యూఢిల్లీ,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్యం ఇంకా విషమంగానే ఉందని, ఎలాంటి మార్పులూ లేవని శుక్రవారం వైద్యులు ప్రకటించారు. ఇంకా వెంటిలేటర్‌పైనే ఉన్నారని ఆర్మీ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్నారని, చికిత్సకు స్పందిస్తున్నారని తెలిపారు. నేటి వరకూ మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పూ లేదు. ఆయన ఐసీయూలో ఉన్నారు. వెంటిలేటర్ పైనే ఉన్నారు. అని ఆర్మీ వైద్యులు తెలిపారు. అయితే ప్రణబ్ ముఖర్జీ కోలుకుంటారన్న ఆశాభావాన్ని ఆయన కుమార్తె షర్మిష్ట ముఖర్జీ వ్యక్తం చేశారు. పరిస్థితి విషమంగానే ఉన్నప్పటికీ మరీ అంతగా దిగజారిపోలేదని చెప్పారు. నాన్న గారి కళ్లలో కొద్దిపాటి మెరుగుదల కనిపిస్తోంది. వెలుగుకు ఆయన కళ్లు స్వల్పంగా స్పందిస్తున్నాయి. వైద్య పరిభాషలో కాకుండా చెప్పుకోవాల్సి వస్తే రెండు రోజులుగా తాను చూస్తున్న దానిని బట్టి ఆయన పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ మరీ అంత దిగజారిపోలేదని నా అభిప్రాయం. వెలుతురుకు ఆయన కళ్లు స్పందిస్తున్నాయి అని శుక్రవారం ఉదయం ఒక ట్వీట్‌లో షర్మిష్ట తెలిపారు. సమష్టి ప్రార్థనలపై తనకు చాలా నమ్మకం ఉందని, క్లిష్టకాలంలో తమకు వెన్నుదన్నుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ప్రార్థనలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

వినాయక చవితి ఉత్సవాలు ఇంటికే పరిమితం కావాలి

కరోనా కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
మట్టి విగ్రహాల పంపిణీని ప్రారంభించిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కరోనా కారణంగా వినాయక చవితి ఉత్సవాలను ఇంటికే పరిమితం చేయాలని మంత్రి కెటిఆర్ అన్నారు. ప్రజలు బహిరంగ వేడుకలకు దూరంగా ఉండాలన్నారు. వేడుకలను ఇళ్లలోనే జరుపుకోవడం ద్వారా కరోనా కట్టడికి తోడ్పడాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను పూజించాలని పిలుపునిచ్చారు. హెచ్ఎండిఏ పరిధిలోని 32 సెంటర్లలో ఉచితంగా 50 వేల మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేపట్టారు. చేయనున్నారు. వినాయక చవితి సందర్భంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ(హెచ్ఎండిఏ) ఈ ఏడాది 8 ఇంచుల ఎత్తు గల 50 వేల పర్యావరణహిత వినాయక(మట్టి) విగ్రహాలు పంపిణీ చేయనున్నారు. తొలి వినాయక విగ్రహాన్ని మంత్రి కేటీఆర్ హైదరాబాద్ మేయర్ బొంతు రాంమోహన్ కి అందజేశారు. హెచ్ఎండిఏ ఉచితంగా పంపిణీ చేయనున్న వినాయక విగ్రహాలను మంత్రి ప్రారంభించారు. ఈ ఏడాది కోవిడ్-19 పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా సామూహిక కార్యక్రమాలపై ఆక్షలు అమలులో ఉన్నందున వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ఎవరి ఇండ్లల్లో వారు భక్తి శ్రద్దలతో నిర్వహించుకోవాలని మంత్రి కేటీఆర్ సూచించారు.

ట్యాంక్ బండ్ హుసేన్ సాగర్ శుద్ధి కార్యక్రమంలో భాగంగా రసాయనాల వాడకంతో(వినియోగంతో) రూపొందించే వినాయక విగ్రహాల వినియోగాన్ని తగ్గించే లక్ష్యంగా హెచ్ఎండిఏ గత ఎనిమిది సంవత్సరాలుగా సాంప్రదాయ మట్టి వినాయక విగ్రహాలను కుమ్మరి కులస్తులతో తయారు చేయించి

స్వచ్ఛంధ సంస్థల ద్వారా ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, హెచ్.ఎం.డి. ఏ మెట్రోపాలిటన్ కమిషనర్ అర్వింద్ కుమార్ , కార్యదర్శి, బిపిపి ఓఎస్డి సంతోష్ , చీఫ్ ఇంజనీర్ బి.ఎల్.ఎన్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కో ఆప్షన్ ఎన్నిక ఏకగ్రీవం

నాలుగు స్థానాలను కైవసం చేసుకున్న టిఆర్ఎస్

నల్లగొండ,ఆగస్ట్ 14(ఆర్ఎన్ఎ): నల్లగొండ మున్సిపాలిటీలో శుక్రవారం జరిగిన కో ఆప్షన్ ఎన్నికల్లో నాలుగుకు నాలుగు స్థానాలు టీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియను కమిషనర్ శరత్ చంద్ర ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికకు టీఆర్ఎస్‌కు చెందిన 20 మున్సిపల్ కౌన్సిలర్లు, ఒక స్వతంత్ర, ఒక ఎంఐఎం, ఒక కాంగ్రెస్ కౌన్సిలర్ హాజరయ్యారు. వీరితో పాటు ఎక్స్ అఫీషియో సభ్యులైన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎమ్మెల్సీ తెరా చిన్నపరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిలు కూడా హాజరయ్యారు. అయితే కాంగ్రెస్, బీజేపీలకు చెందిన సభ్యులు ఎన్నికకు దూరంగా ఉన్నారు. కో ఆప్షన్ సభ్యులుగా టీఆర్ఎస్ కు చెందిన కొండూరు సత్యనారాయణ, గున్‌రెడ్డి రాధిక జనరల్ కోటాలో, జమాలుద్దీన్ ఖాద్రీ ముస్లిం కోటాలో, కంచర్ల తేజశ్రీ క్రిస్టియన్ కోటాలో బరిలో నిలిచారు.

వీరికి పోటీగా ఎవరు లేకపోవడంతో ఎన్నిక సజావుగా ముగిసింది. నిర్ణీత సమయం అనంతరం వీరు నలుగురు ఎన్నికైనట్లు ప్రకటించారు. టీఆర్ఎస్ సభ్యుల ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజనుల జీవనోపాధి మార్గాలను పెంచడమే లక్ష్యం: మంత్రి అల్లోల

నిర్మల్, ఆగష్టు 14: గిరిజనుల జీవనోపాధి మార్గాలను పెంచడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తమ ప్రభుత్వం పనిచేస్తుందని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాంనగర్ లోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఐటీడీఏ ఐటీడీఏ ఆధ్వర్యంలో తోటి (గిరిజన తెగ) కులస్తులకు ప్రభుత్వం మంజూరు చేసిన స్వయం ఉపాధి పథకాల ఉపకరణాలను మంత్రి అల్లోల పంపిణీ చేశారు. 18 మంది లబ్దిదారులకు రూ. 12 లక్షల నిధులతో తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, పిండి గిర్ని ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గిరిజనుల్లో పేదరికాన్ని రూపుమాపి ప్రతి ఒక్కరికి ఆర్థిక బలం చేకూర్చేవిధంగా సీఎం కేసీఆర్ విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనతో పాటు పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఆదివాసుల్లో అత్యంత వెనుకబడిన పీటీజీ కులాల అభ్యున్నతి కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో సీసీడీపీ నిధులను ఖర్చు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి భవేష్ మిశ్రా, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి నర్మద, డీటీడబ్ల్యూవో శ్రీనివాస్ రెడ్డి, పీహెచ్ వో రమణ, ఐటీడీఏ జేడీయం నాగభూషణం, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యం : మేయర్

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు జీహెచ్ఎంసీ పరిధిలో మరో 25 బస్తీ దవాఖానాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మేయర్ బొతు రామ్మోహన్ అన్నారు. సికింద్రాబాద్ కవాడిగూడ భీమా మైదాన్‌లో బస్తీ దవాఖానాను మేయర్ రామ్మోహన్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ పరిధిలో బస్తీ దవాఖానాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు తమ సమీపంలోనే ఆస్పత్రుల్లో వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. హబ్సిగూడ డివిజన్ రాంరెడ్డి నగర్‌లో బస్తీ దవాఖానాను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. సంతోష్‌నగర్ డివిజన్‌లోనూ మరో బస్తీ దవాఖానాను మంత్రి ప్రజలకు అంకితమివ్వనున్నారు. బల్దియా పరిధిలో బస్తీ దవాఖానాలను మంత్రులు, మేయర్, డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వివిధ ప్రాంతాల్లో ప్రారంభించారు.

హబ్సీగూడ డివిజన్ రాంరెడ్డినగర్‌లో బస్తీ దవాఖానను ప్రారంభించిన మంత్రి కేటీఆర్. చిత్రంలో మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

కరోనా సోకిన వారిని మనుషులగా చూడాలి

అంటరానివారిగా చూస్తూ హింసించవద్దు: పుట్టమధు

పెద్దపల్లి,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కరోనా పాజిటివ్ అంటే ప్రజలు భయపడవద్దని, కరోనా సోకిన వారితో మానవత్వంతో ప్రజలు సహకరించాలని జిల్లా జడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గంలో కరోనా సోకిన వారి పట్ల ప్రతి ఒక్కరు భయపడకుండా మానవత్వంతో మెలగాలన్నారు. ఒక మనిషికి మరో మనిషి సహాయం చేసేలా సహకరించాలని సూచించారు. కరోనా అంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారని, కరోనా సోకిన వారు దూరంగా ఉంటూ వారిని హీనంగా చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కరోనా వైరస్ తో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని వారి కుటుంబ సభ్యుల సహకారం కూడా అందకపోవడం శోచనీయం అన్నారు. ఇప్పటికైనా ప్రజలు కరోనా వ్యాధి సోకిన వారి పట్ల మానవత్వంతో ఆలోచించి వారికి చేతనైన సాయం చేయాలన్నారు.

మంథని నియోజక వర్గంలో కరోనా వైరస్ తో మృతి చెందిన వారికి పుట్ట లింగమా ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు. మంథనిలో ఇటీవల ఒక యువకునితోపాటు మరికొంత మంది చనిపోయారని వారి కుటుంబ సభ్యులు కూడా మృతదేహానికి అంత్యక్రియలు

నిర్వహించేందుకు ముందుకు రాకపోవడం తనను బాగా కలిచివేసిందన్నారు. ఇక నుంచి కరోనా వైరస్ తో మృతి చెందిన మృతదేహాలకు పుట్ట లింగమా ట్రస్ట్ ఆధ్వర్యంలోనే అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుతామన్నారు. ఆయన వెంట ఎంపీపీ రాజిరెడ్డి. వైస్ ఎంపీపీ సుదారి రవీందర్ రావు సర్పంచులు, ఎంపీటీసీలు, టీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

హోం క్వారంటైన్‌లో.. కేరళ సీఎం విజయన్

తిరువనంతపురం, ఆగష్టు 14: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్వీయ క్వారంటైన్ విధించుకున్నారు. కోజికోడ్ విమానాశ్రయంలో గత వారం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం కూలిన ఘటనలో దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుల్లో 18 మంది మరణించిన సంగతి తెలిసిందే. కాగా ప్రమాదం అనంతరం సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారుల్లో 22 మందికి కరోనా పాజిటివ్‌గా శుక్రవారం నిర్ధారణ అయ్యింది. కరోనా సోకిన వారిలో జిల్లా కలెక్టర్‌తోపాటు పోలీస్ అధికారి కూడా ఉన్నారు. మరోవైపు సీఎం విజయన్ కూడా నాడు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దీంతో సీఎంతో పాటు ఆయన వెంట ఉన్న అధికారులు క్వారంటైన్‌లో ఉంటారని సీఎం కార్యాలయం శుక్రవారం తెలిపింది. ఈ నేపథ్యంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సహకార, దేవాదాయ శాఖ మంత్రి కడకంపల్లి సురేంద్రన్ జాతీయ జెండాను ఎగురవేస్తారని పేర్కొంది.

విశ్వాస పరీక్ష నెగ్గిన రాజస్థాన్ సీఎం గెహ్లాట్ ప్రభుత్వం

జైపూర్, ఆగష్టు 14: రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో విశ్వాస పరీక్షను నెగ్గింది. సత్యమే విజయం సాధించిందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. రాజస్థాన్ అసెంబ్లీ శుక్రవారం ప్రత్యేకంగా సమావేశం కాగా ఆ రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శాంతి ధారివాల్ విశ్వాస తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. దీనిపై చర్చను ప్రారంభించిన ఆయన కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. మధ్యప్రదేశ్, మణిపూర్, గోవాలోని ప్రభుత్వాలను డబ్బు, అధికారాన్ని ఉపయోగించి కూల్చివేశారని ఆరోపించారు. అయితే రాజస్థాన్‌లో ఇలాంటి ప్రయత్నం విజయవంతం కాలేదని అన్నారు. ఈ సందర్భంగా అక్బర్ గురించి ధారివాల్ ప్రస్తావించారు. మొఘల్ చక్రవర్తి తన సామ్రాజ్యాన్ని విస్తరించాలనే తపనతో రాజస్థాన్ మేవార్‌లో ఓటమిని రుచి చూడాల్సి వచ్చిందన్నారు. అదేవిధంగా, అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని విమర్శించారు.

మరోవైపు విశ్వాస తీర్మానంపై చర్చసందర్భంగా మాట్లాడిన సీఎం గెహ్లాట్.. ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ వంటి ఏజెన్సీలు దేశంలో దుర్వినియోగం కావడం లేదా అని ప్రశ్నించారు. మీరు ఫోనులో ఎందుకు సంభాషించారు, మీ పార్టీలో చేరాలని వాట్సాప్ లేదా ఫేస్‌బుక్ ద్వారా సంప్రదించవచ్చుగా అని బీజేపీని నిలదీశారు. ప్రజాస్వామ్యానికి ఇది మంచిదేనా అని గెహ్లాట్ ప్రశ్నించారు. విశ్వాస తీర్మానంపై చర్చ అనంతరం జరిగిన ఓటింగ్‌లో 107 మంది ఎమ్మెల్యేలు, స్వతంత్ర, మిత్రపక్ష పార్టీల సభ్యుల మద్దతున్న కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచింది. 200 స్థానాలున్న రాజస్థాన్ అసెంబ్లీలో బీజేపీకి 72 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు.

చరిత్రలో నేటినిజం



కం॥ దేవుడు- సంతోషముతో
పావన మొనరింప నాగ భైరవ కులమున్
బాళ్ళుకుని, పావకుని
కోవి దుడుని జనన మొందె కోటేశ్వరుడై !!

-రాధశ్రీ

(ఆగష్టు 15 నాగభైరవ కోటేశ్వరరావు జయంతి..)

సెల్: 9494481210

మరోమారు విషం చిమ్మిన కత్తి మహేశ్

పలువురి ఫిర్యాదుతో అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కత్తి మహేష్ మరోసారి హిందూమతంపై విషం చిమ్మాడు. దీంతో ఆయన్ను తాజాగా సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీరాముని మీద ఫేస్ బుక్‌లో కత్తి మహేష్ అసభ్య కామెంట్స్ చేశారంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను అరెస్ట్ చేసిన పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. నటుడు, సినిమా, రాజకీయ విశ్లేషకుడైన కత్తి మహేష్ ఇప్పటికే ఎన్నో వివాదాల్లో చిక్కున్నారు. కాగా గతంలో కూడా కత్తి మహేశ్ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలు..సోషల్ మీడియాలో దుమారం రేపాయి.

ఓ సారి ఆయన అభ్యంతర వ్యాఖ్యలు చేసి హైదరాబాద్ బహిష్కరణకు సైతం గురయ్యాడు. తాజాగా ఆయన హిందువుల ఆరాధ్య దైవం శ్రీరాముడిపై అనుచిత కామెంట్స్ చేయడంతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసినట్టు తెలుస్తుంది.

ఉస్మానియా హాస్పిటల్ లో వైద్య పరీక్షల తర్వాత నాంపల్లి కోర్టులో కత్తి మహేష్‌ని హాజరుపరిచారు. కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. కమ్యూనల్ యాక్ట్ కింద సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కత్తి మహేష్ కొన్ని నెలల క్రితం తన సోషల్ మీడియా పేజ్‌లో శ్రీరాముడి గురించి రాముడు కరోనా ప్రియుడు అంటూ అసభ్యకర పోస్ట్ లు పెట్టారు.

దీంతో హిందూ సంఘాలు కత్తి మహేష్ పై పలు చోట్ల కేసులు పెట్టాయి. వారి ఫిర్యాదుల ఆధారంగా పలుసార్లు విచారించిన పోలీసులు.. విచారణ తర్వాత ఆయన్ను అరెస్ట్ చేశారు.

సవాళ్లను ఎదుర్కొనే సత్తాను సాధించాలి

నేటినిజం
శనివారం 15-8-2020

దేశం స్వాతంత్య్ర దినోత్సవ వేళ గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రపంచంతో పాటు మనదేశం కూడా అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. కరోనా కారణంగా అనుకోని సవాళ్లు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఈ సవాళ్లు ఇంకా సమసిపోలేదు. అనేక నిర్ణయాలతో ముందుకు పోతున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవన ప్రమాణాలు పెంచి, వారికి ఉపాధి, ఉద్యోగాలను కల్పించే దిశగా పెద్ద ఎత్తున చర్యలు చేపట్టాల్సి ఉంది.

కరోనా కారణంగా దేశ ఆర్థికరంగం పూర్తిగా దెబ్బతిన్నది. ప్రజల వ్యక్తిగత ఆర్థిక భద్రతకు ప్రమాదం ఏర్పడింది. ఉపాధి,ఉద్యోగాలు కోల్పోయి కోట్లాదిమంది రోడ్డున పడ్డారు. ఆహారధాన్యాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. కరోనా వ్యాక్సిన్ వచ్చే వరకు ప్రజలు స్వేచ్ఛగా బయట తిరిగే అవకాశం లేకుండా పోయింది. ప్రజాసంక్షేమం లక్ష్యంగా ఓటు బ్యాంకు పథకాలను పక్కన పెట్టాలి. ప్రజల అవసరాలు తీరుస్తూ వారికి చేరువ కావాలి. విద్యావైద్య రంగాలను పూర్తి పటిష్టం చేయాల్సి ఉంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా భారత్‌ను పటిష్టమైన దేశంగా నిలిపి దేశంలో ఆకలిచావులకు, విద్యావైద్యాలకు లోటు లేకుండా చేయాలి. ప్రభుత్వ పరంగా ఈ రంగాలను తిరుగులేనివిగా తీర్చిదిద్దాల్సి ఉంది. స్వాతంత్య్రం సాధించుకుని గర్వంగా 73ఏళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో పాలకులు తమ విధానాల్లో,ఆలోచనల్లో మార్పులతో ముందుకు సాగాలి. పటిష్ట భారత నిర్మాణానికి కంకణబద్దులు కావాలి. సరిహద్దుల్లో ఉగ్రమూకలను గట్టిగా అణచివేస్తూ ముందుకు సాగాలి. కేంద్రం తీసుకుంటున్న అనేక నిర్ణయాలతో దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్న తరుణంలో ప్రజలు, ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వానికి అండగా నిలవాలి. సమున్నత భారత్ నిర్మాణంలో అంతా కలసికట్టుగా ముందుకు సాగాలి. ఈ స్వాతంత్య్ర దినోత్సవానికి ప్రత్యేకత ఉంది. వందల ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రామజన్మభూమి సమస్యను పరిష్కరించుకో గలిగాం. అక్కడ భవ్యరామమందిర నిర్మాణ కల సాకారం కాబోతున్నది. ఇకపోతే సరిహద్దుల్లో చైనా దుస్సాహసానికి ఒడిగట్టగా మన బలగాలు ధీటైన జవాబును ఇచ్చాయి. గతంతో పోలిస్తే మనం బలపడ్డామనడానికి ఇది సంకేతం. అయితే ఈ పోరులో 20మంది ముద్దుబిడ్డలను భారత్ కోల్పోయింది. వారి త్యాగం వృధా కానీయమని ప్రధాని మోడీ ప్రకటిం చారు. కరోనాను ప్రపంచంపైకి వదిలిన చైనా చిద్విలాసంగా ఉంది. ప్రపంచ ప్రజల దృష్టిని మళ్లించడానికి సరిహద్దుల్లో సైనిక విన్యాసాలతో రెచ్చగొడుతోంది. అలాగే హాంగ్‌కాంగ్‌లో నిరంకుశ విధానాలను అవలం బిస్తూ అక్కడ ప్రజల హక్కులను హరించి వేస్తోంది. దీనిని ఎప్పటికప్పుడు ఎండగడుతూ కరోనాకు దానిని బాధ్యురాలిన చేయాల్సిందే. ఇకపోతే ఓ చారిత్రక నిర్ణయంగా 370 ఆర్టికల్ రద్దుపై తీసుకున్న నిర్ణయంతో ఏడాదిగా కాశ్మీర్‌లో మునపటి కన్నా మెరుగైన పరిస్థితి ఏర్పడింది. అయినా కాశ్మీర్‌లో ఇంకా పరిస్థితి అదుపులో ఉందని చెప్పడానికి లేదు. పాకిస్థాన్ ఇంకా కుట్రలు పన్నుతూనే ఉంది. కాశ్మీర్‌లో స్వేచ్ఛా వాయువులు పీల్చుకునే పరిస్తితులు ఏర్పడ్డాయి. భారత్‌లో భాగస్వామ్యమైన తరవాత రెండోసారి పంద్రాగస్ట్ వేడుకలను జరుపుకుంటోంది. గతంలో ఎన్నోమార్లు అక్కడ త్రివర్ణ పతకాం ఎగురేయాలన్న డిమాండ్‌కు అడ్డంకులు ఉండేవి. లాల్‌చౌక్‌లో జెండా ఎగురవేయడం నేరమైనట్లుగా గతంలో చూశాం. ఇప్పుడు ప్రజలు స్వేఛ్చా స్వాంత్య్రాలను పీల్చుకుని సగర్వంగా కలసి ముందుకు సాగుతున్నారు. ఇకపోతే దేశం విభజననాటినుంచి పాక్ కుతంత్రాలకు కేంద్రంగా ఉంటూ అక్కడి ప్రజలను ఎదగనీయకుండా సైన్యం పడగనీడలో కొనసాగుతోంది. విడిపోయిన వారు శత్రువులుగా మారారు. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు

గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన అవపరం ఉంది. జెండా ఎగుర వేయడమే గాకుండా ప్రజల కోసం పరితపించేలా పాలన సాగిస్తామని ప్రతిన చేయాల్సిన సమయమిది. ఇంతకాలం ఎక్కడ లోపం ఉందో గుర్తించి అవలోకనం చేసుకోవాలి. ఈ 73 ఏళ్ల వైఫల్యాలపై పాలకులు ఆత్మపరిశీలన చేసుకునే సమయమిదే. ఆయా రంగాల్లో ఇంకా మనం వెనకబడే ఉన్నాం. కరోనా పడగవిప్పి బుసకొడితే మనదగ్గర కనీస రోణ కవచాలు కూడా లేవు. మాస్కులు లేవు. ల్యాబులలో టెస్టింగ్ అవకాశాలు లేవు. టెస్టింగ్ కిట్లు లేవు. ఇవన్నీ మన వైద్యరంగంలో ఉన్న లోపాలను ఎత్తి చూపుతున్నాయి. ఒక్కొక్కటిగా వీటిని సమకూర్చుకుంటున్న తరుణంలో స్వయం సమృద్ది దిశగా ముందుకు సాగాలి. ప్రతిదీ దిగుమతి చేసుకునే విధానం నుంచి బయటపడాలి. 130కోట్ల మంది ప్రజలు, సమజవనరులు ఉన్న మనదేశంలో మేధాశక్తికి కూడా కొదవ లేదు. ఇవన్నీ ఉపయోగించుకునే పాలకులు ప్రణాళికలు చేయాలి. రాజకీయాలను పక్కన పెట్టి సానుకూలంగా ఆలోచన చేసి ముందుకు సాగాల్సిన సమయమిది. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడమెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ 70 ఏళ్ల తరవాత కూడా ఇంకా దారిద్య్రం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటిస్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. పాలకులు ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలి. విద్యావైద్య రంగం ఎందుకు వెనకబడి ఉందో తెలుసుకోవాలి. ఆహారధన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామో ఆలోచన చేయాలి. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారు స్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విలాసాలకు ఖర్చు చేసుకుంటున్నారు. ఎన్నికలలో డబ్బు అవసరం లేకుండా సంస్కరణలు తీసుకురాకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా లాభం లేదు. రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం అధికారమే కనుక, ఆ అధికారం కోసం ఎంతకైనా తెగబడతాయని ఈ 73 ఏళ్లలో నిరూపితం అయ్యింది. దేశంలో ఇప్పటికీ సరైన ప్రజారోగ్య వ్యవస్థ లేదని కరోనా మనకు గుర్తు చేసింది. అయినా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ప్రజాధనం వృధా ఖర్చులకు కళ్లెం పడాలి. అప్పుడే ప్రజలకు స్వాతంత్య్ర ఫలం దక్కుతుంది. పాలకులను కట్టడి చేసేలా రాజకీయ విధానాలు మారాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో స్వాతంత్య్ర దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా పాలకులు ప్రజలకోసం కొత్త ఆలోచనలు చేయాలి. కొత్త నిర్ణయాలతో ముందుకు సాగాలి. పటిష్టభారత్ నిర్మాణానికి కంకణబద్దులు కావాలి.

సత్తాచాటే నిర్ణయాలు తీసుకున్న మోడీ

–స్వయం సమృద్ది దిశగా ముందుకు సాగాలి

న్యూఢిల్లీ,ఆగస్ట్14(ఆర్‌ఎన్‌ఎ): మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత తీసుకున్న అనేక నిర్ణయాలు చారిత్రకమైనవిగానే గుర్తించాలి. అన్నింటికి మించి గత ఆరేళ్ల పాలన అవినీతి రహితంగా సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకున్న సత్తా చాటింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత తీసుకుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయి. ఇందులో అనేక నిర్ణయాలు భారత్ పురోగమించడానికి దోహదపడేవిగా ఉన్నాయి. తాజాగా తీసుకున్న కొత్త పన్నుల విధానం, విద్యావిధానం ముఖ్యమైనవిగా చూడాలి. అంతర్జాతీయ పోటీకి తగ్గట్లుగా విద్యారంగాన్ని పటిష్టం చేసేదిగా ఉంది. అలాగే సరళీకృత ఆదాయపన్ను విదానం కూడా ప్రకటించారు. ఇకపోతే రామజన్మభూమి సమస్యకు పరిష్కారం దక్కింది. ఇలా ఒక్కో నిర్ణయం తీసుకుంటున్న తీరు అభినందనీయంగా ఉన్నా ప్రజలకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించిఏ విసయంలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. అలాగే దేశంలో వైద్యరంగం వెక్కిరించేలా ఉంది. గ్రామస్థాయిలో ఇప్పటికీ కనీస వైద్యం అందడం లేదు. పారిశుద్యంపై ఇప్పుడిప్పుడఏ చైతన్యం కలుగుతోంది. కరోనా కారణంగా ప్రజల్లోనూ మార్పులు కనిపిస్తున్నాయి. ఈ దశలో వైద్యరంగంలో తిరుగులేని పురోగతి సాధించాల్సి ఉంది. వైద్య పరికరాలు, టెస్టుల విషయంలో స్వయం సమృద్దిని సాధించాల్సి ఉంది. గతంలో తీసుకున్న అనేక నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి.

ట్రిపుల్ తలాక్‌కు మంగళం పాడడంతో ముస్లిం మహిళలకు వివాహబంధం విషయంలో భరోసా దక్కింది. అలాగే కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు కూడా సాహసోపేత నిర్ణయంగా నిలిచి పోనుంది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ చేసి దాయాదిదేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. అలాగే అవినీతి మరక అంటకుండా మోదీ దేశాన్ని పాలించారన్న ప్రశంసలు ఉన్నాయి. గత ఆరేళ్లుగా తనవైపు వేలెత్తి చూపే అవకాశం లేకుండా మోడీ జాగ్రత్తగా వ్యవహరించారు. ఎక్కడా ఒక కుంభకోణం అన్నది లేకుండా పాలన సాగిస్తున్న తీరు ప్రజల నుంచి అభినందనలు వస్తున్నాయి. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా చేసుకున్నారు. అయితే పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. ప్రధానంగా నోట్లరద్దు, జిఎస్టీతో పడ్డప్రభావం నుంచి ఇంకా కోలుకున్న దాఖలాలు కానరావడం లేదు. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఇది బిజెపికి విజయంగానే చెప్పకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టుకోలేం. భారతీయ జనతా పార్టీ విస్తరణ కాంక్ష మోదీ, షా లను నిలవనివ్వడం లేదు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారు. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ పతాకం రెపరెపలాడాలన్నది ఈ ఇరువురి నాయకుల కోరిక! ఈ కారణంగానే ఇప్పుడు దక్షిణాదిపై దృష్టిపెట్టారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టుపట్టిపోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కూడా అనేక అడ్డదారులు తొక్కింది. రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు. అలాంటి నీచ రాజకయాఆలను పక్కన పెట్టి ప్రజాసంక్షేమం కోసం ముందుకు సాగాలి. ధరలను అదుపు చేసి ప్రజలకు మెరుగైన విద్య,వైద్యం అందించే చర్యలు తీసుకోవాలి. ఉద్యోగాల కల్పనకు కొత్తగా పరిశ్రమల స్థాపన జరగాలి. అప్పుడే ప్రజలకు మేలు చేకూరగలదు.

సింగూరు జలాలను స్థానికులకు దక్కకుండా చేస్తారా

–సిఎం కెసిఆర్‌పై రాణిరుద్రమ మండిపాటు

సంగారెడ్డి,ఆగస్ట్13(ఆర్‌ఎన్‌ఎ): సింగూర్ జలాలను ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు దక్కకుండా దోచుకుపోయిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని యువ తెలంగాణ నాయకురాలు రాణిరుద్రమ దేవి మండిపడ్డారు. నీటి తరలిపంపుపై తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరుపై రాణిరుద్రమ దేవి విమర్శలు గుప్పించారు. కరోనాను అరికట్టడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలం చెందిందని, రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను భ్రష్టు పట్టించిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదే ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టి సామాన్యులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిందే నీళ్లు, నిధులు, నియామకాలు,అభివృద్ధి పిలుపుతోనే అన్నారు. తెలంగాణ పునర్ నిర్మాణం కోసమే యువ తెలంగాణ పార్టీ ఆవిర్భవించిందని ఆమె అన్నారు. పార్టీ కార్యక్రమాలకు ఆకర్షితులై యువత ముందుకు వచ్చి పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని రాణిరుద్రమ దేవి చెప్పారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేసి తెలంగాణ ప్రభుత్వం అవలంభిస్తున్న అరాచకాలపై పోరాటం చేస్తామని రాణిరుద్రమ దేవి హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని హోసింగ్ బోర్డు కాలనీలో యువ తెలంగాణ పార్టీ కార్యాలయాన్ని జిట్టా బాలకృష్ణ రెడ్డి, రాణి రుద్రమ దేవి ప్రారంభించారు.

ఎట్టకేలకు దిగివచ్చిన సచిన్

సిఎం అశోక్ గెహ్లాట్‌తో భేటీ

మద్దతు ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ ఎత్తివేత

జైపూర్,ఆగస్ట్14(ఆర్‌ఎన్‌ఎ): రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్‌కు ఎదురుతిరిగిన కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ ఎట్టకేలకు దిగివచ్చారు. గురువారం అశోక్ గెహ్లాట్ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. గెహ్లాట్ కూడా సచిన్ పైలట్‌ను సాదరంగా ఆహ్వానించారు. రాజస్థాన్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం శుక్రవారం జరగనున్నది. ఈ నేపథ్యంలో సీఎం అశోక్ గెహ్లాట్ గురువారం సాయంత్రం తన నివాసంలో సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేశారు. మరోవైపు నెల రోజులకుపైగా పార్టీకి దూరంగా ఉన్న సచిన్ పైలట్ ఇటీవల రాహుల్, ప్రియాంక గాంధీలతో భేటీతో మెత్తబడ్డారు. ఆయన చెప్పుకున్న సమస్యలపై ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని పార్టీ ఏర్పాటు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో గత కొన్ని రోజులుగా ఢిల్లీలో ఉన్న సచిన్ పైలట్ బుధవారం రాజస్థాన్‌కు తిరిగి వచ్చారు. సీఎల్పీ భేటీ నేపథ్యంలో గురువారం సీఎం గెహ్లాట్ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. అనంతరం జరిగిన సీఎల్పీ భేటీలో సచిన్ పైలట్‌తో పాటు ఆయనకు మద్దతుగా ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా పాల్గొన్నారు. దీనికి ముందు సచిన్ పైలట్ విధేయులైన ఎమ్మెల్యేలు భన్వర్ లాల్ శర్మ, విశ్వేంద్ర సింగ్‌లపై సస్పెన్షన్‌ను కాంగ్రెస్ పార్టీ ఎత్తివేసింది.

స్వాతంత్ర్య భారతం - పేదరిక నిర్మూలనం

(15 ఆగష్టు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా)

ప్రపంచానికి నాగరికతను మరియు సంస్కృతిని నేర్పిన వేదభూమి. భిన్నత్వంలో ఏకత్వం చూపిన అతి పెద్ద ప్రజాస్వామ్యానికి పెట్టింది పేరు. జనాభా 138 కోట్లు దాటుతున్న తీరు. ప్రపంచ దేశాలలో ఆర్థికంగా ఎదుతున్న దేశంగా ఆశావహ సంకేతాలు పంపుతున్న వైనం. అదేగా నా సుందర భారత దేశం. శాంతి, సహనం, సౌభ్రాతృత్వం, కులమతాలకతీతంగా సమైక్య జీవన విధానం పునాదుల మీద నిలబడిన జాతి. వేగంగా ముందడు వేస్తున్న ఇండియా పురోగమన మార్గంలో అవరోధాలుగా అధిక జనాభా, పేదరికం, అవిద్య, అనారోగ్యం లాంటి తీవ్ర సమస్యలు అడ్డుపడుతున్నాయి. ఏ దేశ ప్రగతిలోనైనా నిరోధంగా పేదరికమనే జఠిల సమస్య నిలబడుతోంది. ఇప్పటికీ రోజుకు ఒక పూట కూడా భోజనం దొరకని వారు, రోడ్లు మరియు బస్/రైల్వే స్టేషన్లలో నిద్రించే నిరుపేదలు ఉండడం అత్యంత అవమానకరం. శతాబ్దాల పరాయి పాలనలో నలిగిన భారత్, తిరిగి నిలదొక్కుకునేందుకు గత ఏడు దశాబ్దాలుగా అవిరళ కృషి చేస్తున్నది. భారతదేశంలోంచి పేదరికాన్ని తరిమిన నాడు, విశ్వంలోని 200లకు పైగా దేశాల ముందు అగ్రరాజ్యంగా మనగలుగుతుంది అనడంలో సందేహం లేదు. దేశం ఎదుర్కొంటున్న అతి ప్రధాన సమస్యగా పేదరికం మనకు పెద్ద సవాళ్ళను విసురుతోంది. ప్రపంచ పేదరిక గడియారం ప్రకారం, నిమిషానికి 44 మంది భారతీయులప పేదరికంలోంచి బయట పడుతున్నారని తేల్చారు. ఐరాస అంచనాల ప్రకారం, వేగంగా ఆర్థికాభివృద్ధి మరియు సాంకేతిక వియోగాల వల్ల 2005-06 నుండి 2015-16 దశాబ్దంలో 271 మిలియన్ల ప్రజలు పేదరిక కోరల్లోంచి బయట పడ్డారని, పేదరికం 55 శాతం నుండి 28 శాతానికి తగ్గింది. 2018-19లో 88 మిలియన్ల భారతీయులు (6.7శాతం జనాభా) దారిద్ర్య రేఖ దిగువన ఉన్నారని అంచనా వేసింది. 2020 వివరాల ప్రకారం 21.9 శాతం భారతీయులప పేదరికంలో ఉన్నారని అంచనా వేశారు.

వ్యక్తి లేదా కుటుంబం సాధారణంగా జీవించడానికి అవసరమైన (కూడు,గూడు,గుడ్డ) కనీస ఆర్థిక వనరులు లేని స్థితిని పేదరికంగా సూచిస్తారు. ఆర్థిక వనరులు, కనీస విద్య, గౌరవ జీవనం, ఆరోగ్య భద్రత, సురక్షిత నీరు, పరిసరాల పరిశుభ్రత, ఉద్యోగ ఉపాధికి దూరంగా బతుకుతున్న వారినే పేదలుగా గుర్తించాలని ప్రపంచ బ్యాంక్ నిర్వచిస్తోంది. ఒక వ్యక్తి రోజుకు 1.90 యుయస్ డాలర్ల కన్న తక్కువ ఖర్చుతో జీవిస్తే, వారిని అంతర్జాతీయ దారిద్ర్య రేఖ దిగువన ఉన్న వారుగా పరిగణిస్తారు. పేదరికం పెరిగినపుడు సమాజం అవాంఛనీయ మార్పులైన నిరక్షరాస్యత, ఆర్థిక అసమానతలు, పోషకాహార లోపం, ఆకలి చావులు, గృహవసతి లేమి, బాలకార్మికులు, అపరిశుభ్రచలి, కరువు, నిరుద్యోగం లాంటి పరిణామాలు వస్తాయి. మన దేశంలో 'నీతి ఆయోగ్' ద్వారా పేదరికం అంచనా వేయబడుతుంది. రంగరాజన్ కమిటీ 2014 అంచనాల ప్రకారం, 2009-10లో 454 మిలియన్లు (38.2శాతం) మరియు 2011-12లో 363 మిలియన్ల (29.5శాతం) జనులు దారిద్ర్య రేఖ దిగువన ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో నెలసరి వ్యయం కనీసం 1,407/- మరియు గ్రామీణుల్లో 972/- ఉండాలని, లేనియెడల పేదలుగా సూచించింది. టెన్‌డూల్కర్ కమిటీ ఫార్ములా ప్రకారం ఒక పట్టణ వ్యక్తి రోజుకు 47/- మరియు గ్రామీణ వ్యక్తి 32/- కన్న తక్కువ ఖర్చు చేయగలిగితే పేదలుగా గుర్తించారు.

పేదరికానికి ముఖ్య కారణాలుగా అధిక జనాభా, వ్యవసాయ ఉత్పత్తులు పడిపోవడం, వనరుల వినియోగంలో లోపం, ఆర్థికాభివృద్ధి రేటు పడిపోవడం, ధరలు పెరగడం, నిరుద్యోగం, పెట్టుబడి మరియు ఔత్సాహిక వ్యాపారాలు లేక పోవడం, కాలం చెల్లిన సంప్రదాయాలు, మౌళిక వసతుల కొరత, ఆర్థిక అసమానతలు, నిరక్షరాస్యత,పారిశ్రామికీకరణ తగ్గడం, నైపుణ్యాలు కొరవడడం, పలు సామాజిక అవాంతరాలు లాంటివి వస్తాయి. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, కులమత విశ్వాసాలు వంటివి కూడా పేదరికానికి కారణం కావచ్చు. పేదరికాన్ని రూపుమాపటానికి ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు, ప్రణాళికలు అమలు పరుచుతున్నారు. ఇందిరాగాంధీ ఆలోచనలలోంచి 1971లో "గరీబ హటావో" నినాదం బహుళ ప్రచారంలోకి వచ్చింది. ఇలాంటి పలు పేదరిక నిర్మూలన పథకాలైన ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (1978-19లో), జవహర్ రోజ్‌గార్ యోజన, ఇందిరా ఆవాస్ యోజన, పనికి ఆహార పథకం, జాతీయ వృద్ధాప్య పెన్షన్(2011-12), అన్నపూర్ణ పథకం(1999-20), సంపూర్ణ గ్రామీణ్ రోజ్‌గార్ యోజన, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం(2005), నేషనల్ రూరల్ మరియు అర్బన్ లైవ్లీఉడ్ మిషన్(2011), ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన లాంటి అనేకం అమలు చేయడం ద్వారా పేదరికాన్ని వేగంగా తగ్గించే ప్రయత్నాలు నిరంతరం జరుగుతున్నాయి. పేదరిక నిర్మూలనకు అందరికి ఉచిత విద్య మరియు ఆరోగ్యం, పని కల్పన, గృహవసతి, పరిసరాల పరిశుభ్రత, మౌళిక వసతుల కల్పన, పోషకాహార లభ్యత, వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించడం, యువతలో నైపుణ్య పెంపు, స్థానికంగా వసతుల ఏర్పాటు, ప్రభుత్వ పథకాల పటిష్ట అమలు, అవినీతి మరియు లంచగొండితనాన్ని రూపుమాపడం వంటి పలు బహుముఖీన చర్యలు సత్వరమే తీసుకోవాలి. విశ్వ మానవాళికి మరియు ప్రపంచ దేశాలకు పేదరికం ఒక బహువ్యాధి లక్షణం. పేదరికంతో పాటు నేరాలు, దొంగతనాలు, అశాంతి, అసాంఘీక రూపాలు, మానభంగాలు పెరుగుతాయి. దారిద్ర్యాన్ని రూపుమాపితేనే మనిషి మనిషిగా జీవించగలడు, లేనియెడల జంతు సమానంగా నరకం చవిచూస్తాడు. పేదరికం దేశానికి పట్టిన పీడగా భావించి, దానిని రూపుమాపడానికి అన్ని కోణాలలో చర్యలు తీసుకుంటూ ప్రగతి పథంలో పయనించేందుకు అందరం సహకరిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

జిల్లాలో వేగవంతంగా పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణాలు..!

– జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రజలకు ఆగస్ట్15 లోగా అందుబాటులోకి తేవాలన్న అదనపు కలెక్టర్ రాజర్షి షా.

సంగారెడ్డి ఆగస్ట్ 14 (నేటినిజం ప్రతినిధి) మున్సిపల్ పట్టణాలలో జనాభా ప్రాతిపదికన పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతున్న పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణాలుప్రతి వెయ్యి మందికి ఒకటి చొప్పున ఏర్పాటుజిల్లాలోని 8 మున్సిపాలిటీలలో 50 శాతం టాయిలెట్స్ మహిళలకు ఆగస్టు 15వ తేదీలోగా ప్రజలకు అందుబాటులోకి...... అదనపు కలెక్టర్ రాజర్షి షా పట్టణాలను బహిరంగ మల మూత్ర విసర్జన రహిత పట్టణాలు గా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టినట్లు అదనపు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.

అందులో భాగంగా జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీలలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఈనెల 15 నాటికి అన్ని పురపాలికల్లో మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో పనులు జరుగుతున్నాయన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ నిబంధనల మేరకుప్రతి మున్సిపాలిటీలో ప్రతి వెయ్యి మందికి ఒక మరుగుదొడ్డి నిర్మించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. జిల్లాలో ఎనిమిది మున్సిపాలిటీలలో జనాభా ప్రాతిపదికన ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక టాయిలెట్ చొప్పున 359 టాయిలెట్లు అవసరం కాగా, ఇప్పటికే 116 టాయిలెట్లు ఉన్నాయని, కొత్తగా 243 పబ్లిక్ టాయిలెట్లు నిర్మించేందుకు కలెక్టర్ పాలనాపరమైన అనుమతులు జారీ చేశారని తెలిపారు.

ఇప్పటికే 8 మున్సిపాలిటీలలో 116టాయిలెట్లు ఉన్నాయని కొత్తగా 243 టాయిలెట్లను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు .ప్రతి మున్సిపల్ పరిధిలో నిర్మించే టాయిలెట్లలో తప్పనిసరిగా 50 శాతం మహిళలకు కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. పట్టణ వాసులతో పాటు వివిధ పనుల కోసం గ్రామాల నుండి వచ్చే ప్రజలకు ఇవి ఎంతో ఉపయోగకరంగ ఉంటాయన్నారు.

జిల్లాలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ మినహా మిగతా ఏడు మున్సిపాలిటీలలో మొబైల్ శీ టాయిలెట్లు ఒకటి చొప్పున ఏర్పాటు చేశామన్నారు. జిల్లా మంత్రి హరీష్ రావు గారి సహకారంతో మొబైల్ శ్రీ టాయిలెట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు.

ఎం ఐ యు డి సూచనల మేరకు జిల్లా స్థాయిలో ఇంజనీర్స్ కమిటీ ద్వారా ఏజెన్సీలను ఎంపానెల్ చేసి వర్క్ ఆర్డర్ ఇచ్చామని ఆయన తెలిపారు.

రెండు రకాల ఏజెన్సీలకు పనులు అప్పగించామని ఒక ఏజెన్సీ టాయిలెట్లను నిర్మించి వారే మెయింటెన్ చేయడం, మరొక ఏజెన్సీ నిర్మించిన టాయిలెట్లను మున్సిపాలిటీకి అప్పగించడం చేస్తారని తెలిపారు. సంబంధిత టాయిలెట్ల నిర్వహణ స్లం లెవెల్ ఫెడరేషన్, టౌన్ వికలాంగుల సమితి ద్వారా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సంబంధిత లకు శిక్షణ కూడా పూర్తయిందని పేర్కొన్నారు. దీంతో వారికి ఆదాయం చేకూరుతుందని అన్నారు.

ఆగస్టు 15వ తేదీలోగా పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించా మన్నారు. ప్రతిరోజు మున్సిపల్ కమిషనర్లు, తాను ప్రత్యేకంగా పనులను పర్యవేక్షిస్తున్న ట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పురపాలికలు స్వచ్ఛ పట్టణాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం గా ముందుకు వెళ్తున్నా మన్నారు.

ముగిసిన శ్రావణ ముహూర్తాలు

–శుభ కార్యాల కోసం మరో రెండునెలలు ఆగాల్సిందే

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్‌ఎన్‌ఎ): కరోనా, లాక్‌డౌన్ నిబంధనలతో ఇప్పటివరకు నిరాడంబరంగా కొనసాగుతూ వస్తున్న శుభకార్యాలకు కూడా ఇక తెరపడనుంది. ఇంతకాలం పరిమిత సంఖ్యలో బంధువులను ఆహ్వానించి చేసుకున్న వేడుకలకు ఇక రెండు నెలల విరమం లభించనుంది. శ్రావణ శుభఘడియలు వెళ్లనుండడంతో మంచి ముహూర్తాలు ముగిసాయని ప్రముఖ పంచాంగం పండితులు గంగు భానుమూర్తి అన్నారు. శుక్రవారంతో శుభ ముహూర్తాలు ముగిసాయని అన్నారు. మరో రెండు నెలల వరకు వివాహ, శుభకార్యాల ముహూర్తాలు లేవన్నారు. శ్రావణ బహుళ దశమితో ప్రస్తుతం శుభకార్యాల ముహూర్తాలు ముగుస్తున్నాయి. భాద్రపద మాసంలో ఎక్కువగా పితృదేవతలకు నిర్వహించే కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తుండడంతో శుభ కార్యాలకు మంచి ముహూర్తాలు ఉండవు. తరువాత వచ్చే ఆశ్వయుజం అధిక మాసం వస్తుండడంతో శుభకార్యాలకు మరో నెల రోజులు బ్రేక్ పడనుంది. అనంతరం దేవీ శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాక మళ్లీ శుభ ముహూర్తాలు ఉన్నాయని పంచాంగకర్తలు చెబుతున్నారు. దీంతో శుభకార్యాలు చేసుకునే వారంతా దాదాపు రెండున్నర నెలల పాటు ఆగాల్సిందే. కార్తీకంలో కొన్ని ముహూర్తాలు ఉన్నాయని అన్నారు. కరోనా కట్టడిలో భాగంగా దేశమంతా మార్చి 22 నుంచి లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోగా,అప్పట్నుంచి రెండున్నర నెలల పాటు అత్యవసర సేవలు, నిత్యావసర సరుకుల విక్రయ దుకాణాలు మినహా మిగ తావన్నీ మూతబడ్డాయి. అసలే వివాహాలు, శుభకార్యాలు జోరుగా సాగే సమయంలో లాక్‌డౌన్ విధించడంతో వీటి నిర్వహణ అయోమయంలో పడింది. ఇంతలో కాస్త వెసులుబాటునిస్తూ అతి తక్కువ మందితో భౌతికదూరం పాటిస్తూ, మాస్కులు ధరించి శుభ కార్యక్రమాలు చేసుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. దీంతో శుభకార్యాలను వాయిదా వేసుకుందామనుకున్న వారంతా నిరాడంబరంగా చేసుకునేందుకే ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అన్‌లాక్ ప్రక్రియ కొనసాగుతుండగా, లాక్‌డౌన్ సీజన్‌లోనే మంచి ముహూర్తాలు దాదాపు వెళ్లిపోయాయి. 14.. చివరి శుభ ముహూర్త తేదీ. శుభకార్యాలు చేసుకునే వారంతా మరో రెండున్నర నెలలు ఆగాల్సిందేనని పురోహితులు చెబుతున్నారు. మరోపక్క ఈ నెల 31తో అన్‌లాక్ 3.0 ముగియనుంది. వచ్చే నెలలో మరిన్ని కార్యకలాపాల నిర్వహణకు ప్రభుత్వం అనుమతివ్వనుంది. మరో రెండు నెలల్లో క్రమంగా అన్ని రంగాలు తెరుచుకుంటా యని, తిరిగి శుభ ముహూర్తాలు దగ్గరపడే నాటికి పరిస్థితులు అనుకూలంగా మారగలవని భావిస్తున్నారు.

కరోనాకు మాజీ ఐఎఎస్ బలి

–పాట్నా ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ శ్రీవాస్తవ మృతి

పాట్నా,ఆగస్ట్14(ఆర్‌ఎన్‌ఎ): కరోనాకు మరో అధికారి బలయ్యాడు. బీహార్ కేడర్ 1980 బ్యాచ్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మనోజ్ శ్రీవాస్తవ (65) కరోనా బారినపడగా.. గురువారం పాట్నా ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. బీహార్ విపత్తు నిర్వహణ విభాగం వ్యవస్థాపక కార్యదర్శిగా ఆయన సమర్థవంతమైన వ్యూహాలను రచించారని పేరుంది. ఎస్‌డీఎం మొదటి పోస్టు నుంచి ప్రిన్సిపాల్ సెక్రెటరీ హోదా పని చేయగా, పీపుల్స్ ఫ్రెండ్లీ ఆఫీసర్‌గా పేరుపొందారు శ్రీవాస్తవ. యూఎన్ డీపీ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ కింద 2007లో బీహార్‌లో వరదల సమయంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఉచిత ఆహార పంపిణీ వ్యవస్థ ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. డీఎంగా భోజ్‌పూర్‌లో నక్సలిజంపై ఆయన చేసిన పరిశోధన అత్యంత అద్భుతమైన విజయం. ఆయన లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్, ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలకు పూర్వ విద్యార్థిగానే కాక, ఐఐఎం, అహ్మదాబాద్‌లలో విశిష్ట వ్యక్తి. బ్యూరోక్రటిక్ సర్కిల్‌లో నడిచే ఎన్‌సైక్లోపిడియాగా పేరు పొందిన ఆయన.. అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదువుకున్నారు. ఐఏఎస్‌కు ఎంపికవ్వక ముందు శ్రీవాత్సవ ఇండియన్ పోలీస్ సర్వీసెస్ (ఐపీఎస్) ప్రొబేషనర్‌గా పని చేశారు. 2016లో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ నుంచి రిటైర్ అయ్యారు.

సరళాసాగర్ ప్రాజెక్ట్ పునరుద్దరణ

–ప్రాజెక్ట్ కింద నీరిస్తామన్న మంత్రి నిరంజన్

వనపర్తి,ఆగస్ట్14(ఆర్‌ఎన్‌ఎ): సీఎం కేసీఆర్ చొరవతో ప్రాజెక్ట్ లకు మహర్దశ పట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గం మదనపురం మండలంలోని సరళ సాగర్ ప్రాజెక్టు కట్ట గత ఏడాది డిసెంబర్ 31న తెగిపోగా దానిని పునరుద్దరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో అతి తక్కువ కాలంలో నే యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తయ్యాయని తెలిపారు. సరళా సాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు రెండు పంటలకు నీరు ఇస్తామని మంత్రి తెలిపారు. రైతులకు సాగునీరు అందించాలని సీఎం కేసీఆర్ నిరంతరం తపన పడతారని పేర్కొన్నారు. కట్ట తెగిపోతే ముఖ్యమంత్రి మాకు ధైర్యం చెప్పారు. రాష్ట్రంలో సాగు సంబురంగా కొనసాగుతున్నదని చెప్పారు. తెలంగాణలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. ఈ రోజు వరకు కోటి ఇరవై లక్షలకు ఎకరాలకు పైగా సాగు అయిందని వివరాలు వెల్లడించారు. ఇంకో పదిలక్షలకు పైగా ఎకరాలు సాగు అయ్యే అవకాశం ఉంది. నియంత్రిత సాగు విజయవంతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. రైతులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రాజెక్ట్ కు మంత్రి జల పూజ చేశారు. కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో వేయికోట్లు దోచేసిన చైనా కంపెనీ

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్‌ఎన్‌ఎ): లాక్‌డౌన్‌లో ఓ చైనా కంపెనీ భారీ మోసానికి పాల్పడింది. ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్ పేర్లతో దేశవ్యాప్తంగా రూ.వెయ్యి కోట్ల వరకు చైనా కంపెనీ వసూలు చేసింది. పలువురి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు చైనాకు చెందిన వ్యక్తితో పాటు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. సీసీఎస్ డీసీపీ అవినాష్ మహంతి ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోంది. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారి తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్ డౌన్ విధించిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో చైనాకు చెందిన ఓ కంపెనీ భారీ మోసానికి పాల్పడింది. కాగా.. లాక్‌డౌన్ సమయంలో ఇంత పెద్ద మొత్తంలో మోసం జరగడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ భారీ మోసానికి పోలీసులే ఒకింత కంగుతిన్నారు. పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోంది.

ముప్కాల్‌లో నారసింహ ఆలయం

- నిర్మాణానికి మంత్రి వేముల శంకుస్థాపన

నిజామాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని రోడ్లు, భవనాలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ముప్కాల్ లో రూ. 34లక్షలతో నూతనంగా నిర్మించే లక్ష్మీ నరసింహా స్వామి ఆలయానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ పాలనలోనే ఆలయాలకు మహర్దశ పట్టిందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ వీఆర్ మృతి

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): సీనియర్ జర్నలిస్ట్, తెలుగు భాషాభిమాని పట్నాయకుని వెంకటేశ్వరరావు(58) కన్నుమూశారు. అనారోగ్యంతో కొన్ని రోజులుగా ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కార్డియాక్ అరెస్ట్ వల్ల ఆయన మరణించినట్లు గురువారం రాత్రి వైద్యులు ప్రకటించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని సంతబొమ్మాళి మండలం కాపు గోదాయవలస అనే గ్రామంలో జన్మించిన ఆయన 30 ఏళ్లుగా పలు ప్రధాన పత్రికల్లో వివిధ హోదాల్లో పని చేశారు. ప్రస్తుతం సాక్షి హైదరాబాద్ కార్యాలయంలో డిప్యూటీ న్యూస్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పత్రికా రంగంలో పనిచేస్తూనే.. తెలుగు భాషపై ఉన్న మమకారంతో వీఆర్ యూట్యూబ్ చానల్ ద్వారా 'వారం వారం తెలుగు హారం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. అమ్మ భాష గొప్పతనాన్ని పదుగురికి తెలియజెప్పేలా ప్రముఖ సాహితీవేత్తలు, రచయితలు, కవులతో తన చానల్ ద్వారా ప్రతి ఆదివారం లైవ్ షో నిర్వహించేవారు. పట్నాయకుని వెంకటేశ్వరరావు(వీఆర్) మృతి పట్ల పలు జర్నలిస్ట్ సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు.

అమెజాన్‌లో ఆన్‌లైన్ ఫార్మసీ

-ఆర్డర్ చేస్తే ఇంటికే మందులు

బెంగళూరు,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): ఆన్‌లైన్ రిటేల్ సంస్థ అమెజాన్ ఇండియాలో ఇంటర్నెట్ ఫార్మసీని ప్రారంభించింది. ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా మందులను కొనుగోలు చేయవచ్చు. ఆన్‌లైన్ మెడిసిన్ మార్కెట్‌లో అమెజాన్ కొత్త ట్రెండ్ క్రియేట్ చేయనున్నది. బెంగుళూరులో అమెజాన్ ఫార్మసీ అరంగేట్రం చేయనున్నది. ఆ తర్వాత మిగితా నగరాలకు ఇది విస్తరించనున్నది.భారతీయ ఆర్థిక వ్యవస్థలో ఇటీవల అమెరికా టెక్నాలజీ కంపెనీలు భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాయి. ప్రిస్క్రిప్షన్ ఆధారంగా అమెజాన్ ఫార్మసీ మందులను సరఫరా చేయనున్నది. కీలకమైన సమయంలో కష్టమర్ల ఇంట్లో ఉండే తమకు కావాల్సిన మందులను తెప్పించుకోవచ్చు అని అమెజాన్ పేర్కొన్నది. 2017లో ఫార్మసీ రిటేల్ మార్కెట్‌లోకి అమెజాన్ ఎంటర్ అయ్యింది. ఆ తర్వాత అమెరికాలో పిల్‌ప్యాక్ పేరుతో మందులను సరఫరా చేయడం మొదలుపెట్టింది. బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా దేశాల్లోనూ ఆన్‌లైన్ ఫార్మసీని అమెజాన్ స్టార్ట్ చేసింది.

నిలకడగా ఎస్పీ బాలు ఆరోగ్యం

చెన్నై,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కొద్ది రోజుల క్రితం కరోనా బారిన పడి కోలుకుంటున్నారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. తన ఆరోగ్యంపై ఆందోళన వద్దని, ఈ విషయాన్ని ఆయన ఓ వీడియో ద్వారా స్వయంగా వెల్లడించారు. చెన్నైలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నట్టు తెలిపారు. త్వరగా కోలుకొని మళ్లీ మీ అందరిని కలుస్తా అని చెప్పుకొచ్చారు. తాజాగా ఆ హాస్పిటల్ డాక్టర్లు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం హెల్త్ కండిషన్ పై బులిటెన్ విడుదల చేశారు. ప్రస్తుతం బాలూ గారి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉంది. శరీరంలో ఆక్సిజన్ లెవెల్స్ నిలకడగా ఉన్నాయి. ఎప్పటికప్పుడు వైద్యుల పర్యవేక్షణలో మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. బాలుని మైడిపెండెన్సీలో ఉంచి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నట్టు తమ బులిటెన్‌లో పేర్కొన్నారు. కాగా, బాలసుబ్రహ్మణ్యం త్వరగా కోలుకోవాలని ఆయన అభిమానులు ప్రార్థనలు చేస్తున్నారు.

కరోన నుంచి విముక్తి పొందిన సిద్దరామయ్య

-మణిపాల్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్

బెంగళూరు,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కర్ణాటక మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య కరోనా నుంచి కోలుకున్నారు. ఆయనకు నిర్వహించిన రెండో పరీక్షలోను నెగిటివ్ రిపోర్టు వచ్చింది. దీంతో బెంగళూరులోని మణిపాల్ దవాఖాన నుంచి గురువారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. 72 ఏండ్ల సిద్దరామయ్య ఈ నెల 3న మూత్ర సంబంధ సమస్యతో దవాఖానలో చేరారు. ఆయనకు కరోనా పరీక్ష నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. మణిపాల్ దవాఖానలో పది రోజుల పాటు చికిత్స పొందిన సిద్దరామయ్య గురువారం డిశ్చార్జ్ అయ్యారు. కాగా, నిబంధనల ప్రకారం ఆయన వారం రోజులు హోం క్వారంటైన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. సిద్దరామయ్య కుమారుడు, కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ యతింద్రకు కూడా ఈ నెల 7న కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది.

ముంబైని ముంచెత్తిన వానలు

-వాగులను తలపిస్తున్న రహదారులు

ముంబై,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ):దేశ ఆర్థిక రాజధాని ముంబైని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై వరద నీరు నిలిచి వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా టూవీలర్ ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కరోనా మహమ్మారికి కుండపోత వానలు తోడవడంతో జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. శుక్రవారం సైతం ముంబై మహానగరంతోపాటు థానే, పాల్ఘర్, రాయ్గడ్, రత్నగిరి, సింధుదుర్గ్ ప్రాంతాల్లో వర్షం కురిసింది. ముంపు ప్రాంతాల్లో బ్రిహాన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

జెండా వందనానికి ఏర్పాట్లు పూర్తి

-నల్లగొండలో గుత్తా, సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డిల పతాకావిష్కరణ

నల్లగొండ,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కరోనా విజృంభిస్తున్న తరుణంలో ఈ ఏడాది పంద్రాగస్టు వేడుకలను నిరాడంబరంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భౌతిక దూరం పాటిస్తూ ఆయా జిల్లాల్లో మంత్రులు జెండా ఆవిష్కరిస్తారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం జరిపినట్లుగానే స్వాతంత్ర్య దినోత్సవం సైతం నిర్వహించాలని ఇటీవల మంత్రివర్గం తీర్మానించింది. ఈ మేరకు ఉత్సవాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేసారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నల్లగొండ జిల్లాకేంద్రంలోని పరేడ్‌గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సూర్యాపేటలో జెండాను ఎగురవేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయజెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అదే విధంగా ఎమ్మెల్యేలు, జిల్లాపరిషత్ చైర్మన్లు, మున్సిపల్ చైరపర్సన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లతోపాటు అన్ని శాఖాధిపతుల కార్యాలయాల్లో ఉదయం 9.30గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించాల్సిందిగా పేర్కొన్నారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనూ కొవిడ్ నిబంధనలు పాటిస్తూ వేడుకలు జరుపుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది.

సోనూసూద్ మరో సాయం

కాలేయ మార్పిడి చిన్నారులకు ప్రయాణ ఏర్పాట్లు

ముంబై,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కాలేయ మార్పిడి చికిత్స కోసం ఫిలిప్పీన్స్ నుంచి న్యూఢిల్లీకి రావాల్సిన 39 మంది చిన్నారుల ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నటుడు సోనూసూద్ వెల్లడించారు. ఫిలిప్పీన్స్‌కు చెందిన వీరంతా బైలరీ అట్రిసియా అనే కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. అయితే వీరికి ఢిల్లీలో లివర్ ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్ చేయాల్సి ఉంది. కానీ కరోనా విజృంభణ కారణంగా ప్రయాణం కుదరడం లేదని సోనూసూద్ దృష్టికి వచ్చింది. దీంతో సోనూ స్పందించారు. వచ్చే రెండ్రోజుల్లో వీరిని ఢిల్లీకి తీసుకువస్తామని, వీరి విలువైన ప్రాణాలు కాపాడాల్సి ఉందని ట్వీట్ లో పేర్కొన్నారు. ఇచ్చిన మాటప్రకారం సునూ ప్రత్యేక విమానం ఏర్పాటు చేసారు. ఈ విమానం శుక్రవారం మనీలా నుంచి బయల్దేరి ఢిల్లీ చేరుకోనుంది.

నారసింహుడి పూజాదికాలకు గోదావరి నీరు

కొండపోచమ్మ నుంచి గోదావరి జలాలు మళ్లింపు

బస్వాపూర్ రిజర్వాయర్ ద్వారా తరలించే అవకాశం

యాదాద్రి,ఆగస్టు 14 (ఆర్ఎన్ఎ): యాదాద్రి లక్ష్మీనృసింహుడి ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. స్వామివారికి ఎలాంటి లోటుపాట్లు రాకుండా పటిష్టంగా చర్యలు తీసుకుంటున్నారు. వాస్తు, ఆచార లోపాలు రాకుండా చూస్తున్నారు. దీనికితోడు గోదావరి జలాలతో నిత్యం స్వామికి పూజాదికాలు, అభిషేకాలు జరిగేలా ప్రణాళిక సిద్ధం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా యాదాద్రి చెంతకు చేరనున్న గోదావరి జలాలను మళ్లించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. కొండపోచమ్మ నుంచి గంధమల్ల రిజర్వాయర్‌కు నీటిని తరలించి అక్కడి నుంచి యాదాద్రికి తరలిస్తారు. ఇందుకోసం యాదాద్రి చెరువును జలాశయంగా మార్చి అక్కడి నుంచి పైపుల ద్వారా కొండపైకి నీటిని తరలించే ప్రణాళికలు చేస్తున్నారు.

స్వామివారి పూజా కైంకర్యాలను తిరుమల తిరుమతి దేవస్థానం స్థాయిలో నిర్వహించేందుకు వైటీడీఏ దృష్టిసారించింది. తిరుమల క్షేత్రంలో శాస్త్రపరంగా అత్యంత ప్రాముఖ్యమైన బంగారు బావిని కూడా నృసింహుడి సన్నిధిలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఆగమ పండితులు, స్థపతులతో చర్చించిన వైటీడీఏ అధికారులు, స్వామివారు కొలువైన కొండగుహలో ఈశాన్య దిక్కులో బంగారు బావిని నెలకొల్పాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. స్వామివారికి పాంచరాత్రాగమశాస్త్రానుసారం అభిషేకం, ఇతర పూజా కైంకర్యాలకు పుణ్యజలాన్ని ప్రతిరోజు వేకువజామున కొండపై విష్ణుపుష్కరిణి నుంచి తెస్తున్నారు. ఆలయ విస్తరణలో భాగంగా విష్ణు పుష్కరిణి పునరుద్ధరణను కూడా చేపట్టారు. అయితే ఆగమశాస్త్రానుసారం స్వామివారి అభిషేకాలకు వినియోగించే పుణ్యజలాల కోసం బంగారు బావిని స్వామివారి సన్నిధిలోనే నెలకొల్పడం బాగుటుందనే సూచనలు వచ్చాయి. బంగారుబావి నుంచి నీళ్లు చేదేందుకు చేతబావి తరహాలో ప్రత్యేకంగా తాడు, గిరక, బొక్కెనలను ఏర్పాటు చేస్తారు. అత్యంత విశిష్టత ఉన్న ఈ బంగారుబావికి గోదావరిజలాలను తరలిస్తారు. దీంతో నిరంతరాయంగా గోదావరి జలాలను స్వామి సేవలకు వినియోగిస్తారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నరసింహ(బస్వాపూర్) రిజర్వాయర్‌ను పర్యాటకంగానూ అభివృద్ధి చేయనున్నాను. ఇది యాదాద్రి క్షేత్రానికి 10కి.మీ. దూరంలోనే ఉన్నది. కాళేశ్వరం ప్రాజెక్టు 16ప్యాకేజీ కింద చేపట్టిన ప్రాజెక్టు నిర్మాణం దాదాపు పూర్తయింది. 11.3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్టులోకి ఈ సీజన్‌లోనే 1.5 టీఎంసీల నీటిని తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి ఈ ప్రాజెక్టులోకి గ్రావిటీ ద్వారానే నీటిని తరలించవచ్చు. ఇక్కడ బోటింగ్‌తో పాటు టూరిజం కాటేజీలు నిర్మించనున్నారు. రాష్ట్రానికే తలమాని కంగా, నల్లరాతి శిలలతో అద్భుతంగా రూపుదిద్దుకుంటున్న యాదాద్రి ఆలయ పునర్నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. సుమారు 4ఎకరాల 10 గుంటల విస్తీర్ణంలో ప్రధాన ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గర్భాలయం, ముఖమంటపం, అంతర బాహ్య ప్రాకార మంటపాలు, అష్టభుజి మంటపాలు, దివ్యవిమానం, ఆరు రాజగోపురాలు, బ్రహ్మోత్సవ మంటపం, పుష్కరిణిల నిర్మాణాలు తుదిదశకు చేరుకొని తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. 12 భక్తాగ్రేసర ఆళ్వారుస్వాముల విగ్రహాల ఏర్పాటు పూర్తికావచ్చింది. శివాలయం, ఆంజనేయస్వామి, ఆండాళ్, గరుడాలయాల ఫ్లోరింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి

స్వాతంత్ర్య వేళ వరద ముంపులో పలు రాష్ట్రాలు

అంటువ్యాధుల భయంతో ప్రజల్లో ఆందోళన

నదుల్లో జలకళతో ప్రాజక్టులకు భారీగా నీరు

న్యూఢిల్లీ,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): దేశం స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న వేళ అనేక రాష్ట్రాలు జలదిగ్బంధంలో మునిగి ఉన్నాయి. భారీ వర్షాలు మహారాష్ట్ర, కర్నాటక, కేరళలను అతలాకుతలం చేస్తున్నాయి. అలాగే ఉత్తరాది రాష్ట్రాలు గుజరాత్, హిమాచల్,అసోం తదితర రాష్ట్రాలను కూడా కుదిపాయి. ఇప్పటికే నీటిలోనే ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఇంకా వరదల భయం వీడలేదు. అనేకమంది మృత్యువాత పడ్డారు. కేరళలో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే అక్కడ 55మంది మృత్యువాత పడ్డారు. నిత్యావసరాల కోసం అనేకులు ఎదురు చూస్తున్నారు. అంటువ్యాధులు పొంచివు న్నాయి. ఈ సమస్యలపై ప్రధానంగా ఇప్పుడు దృష్టి సారించాలి. ఇకపోతే నదుల అనుసంధానం గురించి మాట్లాడు తున్న మనం వరదల గురించి కూడా మాట్లాడుకుని, వాటి నివారణకు పూనుకోవాలి. పాలకులు ఈ దిశగా వరదలకు కారణాలను అన్వేషించాలి. ప్రకృతి విధ్వంసం కారణంగా అకాల వరదలు పోటెత్తాయి. మళ్లీ నీరంతా సముద్రంలో కలుస్తోంది. నదుల అనుసంధానం అంశం తెరమరుగయ్యింది. తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరి, వంశధార నదులు పోటాపోటీగా ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో నదీ పరీవాహక ప్రాంతంలో ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. నీటినిల్వకు అనువైన ప్రాజెక్టులు లేకపోవడం, పోలవరం పూర్తి కాకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. అలాగే తెలంగాణలో శ్రీరాంసాగర్, మంజీరాల్లోకి నీరు ఇంకా రాలేదు. హైదరాబాద్ జంట జలాశయాల్లోకి కూడా నీరు చేరలేదు. కృష్ణా, వంశధార నదుల్లో సెప్టెంబరు వరకూ.. గోదావరి నదిలో అక్టోబర్ వరకూ వరద ప్రవాహం ఉంటుంది. రుతుపవనాల వల్ల సమృద్ధిగా వర్షాలు కురిస్తే పెన్నా నది కూడా పొంగుతుంది. వర్షాలు ఇలాగే కొనసాగితే మధ్య తరహా ప్రాజెక్టులు సైతం నిండుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకోవడంతో ప్రాజెక్టుల కింద ఆయకట్టులో ఖరీఫ్, రబీ పంటల సాగుకు అవకాశం ఏర్పడిందని సాగునీటి రంగ నిపుణులు చెబుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఇప్పటికే గోదావరి డెల్టాలో నీటిని విడుదల చేశారు. కృష్ణా డెల్టాలో కూడా సాగునీరు విడుదల చేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ కింద నీటిని విడుదల చేశారు. కృష్ణా, తుంగభద్ర నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండడం, ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తుండడంతో రాయలసీమ, నెల్లూరు జిల్లాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది తుంగభద్రలో నీటి లభ్యత పెరిగే అవకాశం ఉంది. చిన్న తరహా ప్రాజెక్టులు, చెరువులు కొంతవరకు నిండాయి. నీటి లభ్యత ఆధారంగా వాటి ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తంగా సాగుకు అవకాశాలు పెరిగాయి.

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్

కరోనా కష్టకాలంలోనూ రైతులకు బాసట

ప్రమాణస్వీకారం చేసిన మార్కెట్ కమిటీ

ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి పువ్వాడ

ఖమ్మం,ఆగస్టు14(ఆర్ఎన్ఎ): కరోనా కష్టకాలంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు బాసటగా నిలిచిందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. అలాగే వ్యవసాయరంగానికి కేటాయంపులు ఆగలేదన్నారు. జిల్లాలోని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారంలో ముఖ్య అతిథిగా మంత్రి పువ్వాడ హాజరయ్యారు. నూతన చైర్మన్ గా వడ్డియా సెట్ రాం నాయక్, వైస్ చైర్మన్, 12 మంది డైరెక్టర్లు మంత్రి పువ్వాడ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ..కరోనా మహమ్మారి విజృంభిస్తున్న వేళ పంట చేతికి రావడంతో ఏమి చెయ్యాలో దిక్కు తోచని స్థితిలో ఉన్న రైతాంగాన్ని ఆదుకుంది ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన గుర్తు చేశారు. ధాన్యం చేతికొచ్చిన సమయంలో ఊరురా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే సాహసోపేత నిర్ణయానికి నాంది పలికారన్నారు. విజయవంతంగా పంటలను ఎక్కడికక్కడే కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి పంటలు కొని ప్రతి పైసాను రైతుల ఖాతాల్లో వేశామన్నారు. నేడు తెలంగాణ రైస్ బౌల్గా ఆ కీర్తిని సాధించుకున్నామని, అది ముఖ్య మంత్రి కేసీఆర్‌కు రైతులపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. జిల్లాలో వానాకాలం పంటల సాగుకు 24.611 టీఎంసీలు కేటాయించారని, వార బందీ విధానంలో కాలువలకు నీటిని విడుదల చేసి, ఆయకట్టు చివరి భూములకు సైతం నీటిని అందించడం ఇప్పటి వరకు జరగలేదన్నారు. ప్రభుత్వం కలిస్తున్న ప్రతి పథకాన్ని రైతుకు అందించడం మన బాధ్యత అని, వ్యవసాయ పాలకవర్గం రైతుల ప్రయోజనాలకోసం పని చేయాలని హితువు పలికారు.

తిరుమలలో ప్రత్యేకంగా పరకామణి భవనం

శంకుస్థాపన చేసిన చైర్మన్ వైవి

నిర్మాణ వ్యయం భరించనున్న భక్తుడు మురళీకృష్ణ

తిరుమల,ఆగస్ట్ 14(ఆర్ఎన్ఎ): కలియుగ వైకుంఠంలా అలరారుతోన్న పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో మరో కొత్త భవనం నిర్మితం కానుంది. ఈ భవనం నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారు. శ్రీవారి ఆలయానికి సమీపంలో.. తూర్పు మాడా వీధిలో ఈ కాంప్లెక్స్ రూపుదిద్దు కోబోతోంది. ఈ భవన సముదాయం నిర్మాణ వ్యయం 8 కోట్ల 90 లక్షల రూపాయలు. మురళీకృష్ణ అనే శ్రీవారి భక్తుడు నిర్మాణ వ్యయాన్ని భరించడానికి ముందుకొచ్చారు. ఈ మొత్తాన్ని తిరుమలకు విరాళంగా అందజేస్తానని ప్రకటించారు. పరకామణి కోసం దీన్ని నిర్మిస్తున్నారు. ఏడుకొండల వాడిని దర్శించుకున్న సందర్భంగా భక్తులు హుండీ ద్వారా సమర్పించుకునే కానుకలను లెక్కించడానికి ప్రత్యేకంగా ఈ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పరకామణి.. శ్రీవారి ఆలయప్రాకారం లోపల కొనసాగుతోంది. దీన్ని వెలుపలికి తరలించాలని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి నిర్ణయించింది. శ్రీవారి ఆలయ ప్రాంగణం లో ఇరుకు గదుల్లో హుండీ కానుకల లెక్కింపును నిర్వహిస్తున్నారు టీటీడీ ఉద్యోగులు. భక్తుల సంఖ్య పెరుగుతుండటం వల్ల పరకామణిని ఆలయ ప్రాంగణం లోపల కొనసాగించడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయనే అభిప్రాయాలు చాలాకాలం నుంచి టీటీడీలో వ్యక్తమౌతున్నాయి. నువిశాల భవనంలో దీన్ని నిర్మించాలని టీటీడీ ఎట్టకేలకు నిర్ణయం తీసుకుంది. సుమారు 15 వేల చదరపు అడుగుల్లో అత్యాధునికంగా ఈ భవనాన్ని నిర్మించబోతున్నారు. సీసీటీవీ, బయోమెట్రిక్ వ్యవస్థను ఇందులో ఏర్పాటు చేయనున్నారు. పరకామణి కోసం కొత్త భవనాన్ని నిర్మించడానికి ఇదివరకు నిర్వహించిన పాలక మండలి సమావేశంలో తీర్మానించారు. నిర్మాణ వ్యయం అంచనాను ప్రాథమికంగా నిర్ధారించారు. 8 కోట్ల 90 లక్షల రూపాయల వ్యయంతో ప్రతిపాదనలను రూపొందించారు. బెంగళూరుకు చెందిన మురళీధర్ అనే భక్తుడు ఈ మొత్తాన్ని విరాళంగా అందిస్తానని టీటీడీకి వెల్లడించారు. ఆయన ఇచ్చే విరాళం మొత్తంతో దీన్ని నిర్మిస్తున్నారు. కానుకల లెక్కింపు ప్రక్రియను భక్తులు నేరుగా వీక్షించేలా భవన సముదాయాన్ని నిర్మిస్తారని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ సౌకర్యం అంతంతమాత్రంగానే ఉంటోంది. బుల్లెట్ ప్రూఫ్ అద్దాలను అమర్చుతారని తెలుస్తోంది.

ప్రపంచస్థాయికి దీటుగా కొత్త విద్యావిధానం

యువతరం గ్లోబల్ పోటీని తట్టుకునేలా ఉంది

విద్యారంగ ప్రముఖులతో గవర్నర్ తమిళిసైసౌందర రాజన్

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020' భారత దేశాన్ని విద్యా రంగంలో ప్రపంచ స్థాయిలో నిలపడానికి తోడ్పడుతుందని గవర్నర్ తమిళిసైసౌందర రాజన్ అన్నారు. మూడున్నర దశాబ్దాల తర్వాత వచ్చిన ఈ జాతీయ విద్యా విధానం భారత దేశ విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణల ద్వారా 21 శతాబ్దాపు విద్యా విధానానికి శ్రీకారం చుడుతుందని అన్నారు. ' పర్ స్పెక్టివ్ ఆన్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020- రోడ్ మ్యాప్‌ఫర్ తెలంగాణ' అన్నఅంశంపై విద్యారంగ ప్రముఖులతో గురువారం గవర్నర్ వెబినార్ నిర్వహించారు. ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ యువతరం మెజార్టీగా ఉన్నభారత్ లాంటి దేశాల్లో నైపుణ్యాల శిక్షణ, గ్లోబల్ పోటీని తట్టుకునే విధంగా ఉద్యోగితా నైపుణ్యాలు, నూతన ఆవిష్కరణలను, పరిశోధనలు ప్రోత్సహించే విధంగా ఈ విద్యా పాతసీని కస్తూరి రంగన్ నేతృత్వంలోని కమిటీ రూపొందించిందని తెలిపారు. భారత్‌ను ఉన్నత విద్యలో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దడానికి , పూర్వ ప్రాథమిక విద్య నుంచి పీహెచ్‌డి పరిశోధనల వరకు మొత్త విద్యా వ్యవస్థను సంస్కరించి, సమూలంగా మార్చి 21వ శతాబ్దాపు అవసరాలకనుగుణంగా మార్చేదిశగా ఈ కొత్త విద్యా పాలసీ ఉందని గవర్నర్ వెల్లడించారు. గత నాలుగు దశాబ్దాల్లో ప్రపంచం కనీ వినీఎరుగని విధంగా మారింది. అందుకు తగిన రీతిలో కృత్రిమమేధ, మెషిన్‌లెర్నింగ్, టెక్నాలజీ, కోడింగ్, డిజిటల్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, ఫార్మా, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తూనే భారతీయ మూలాలను గౌరవించే విద్యా విధానానికి రూపకల్పన జరిగిందని గవర్నర్ చెప్పారు. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో బోధనలతోనే పిల్లల్లో గొప్ప మానసిక వికాసం సాధ్యమౌతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఇఫ్లూ విసి ప్రొఫెసర్ సురేశ్ కుమార్, ప్రొఫెసర్ వి. వెంకటరమణ, ప్రొఫెసర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

కెటీఆర్ ఆలోచనలకు ప్రతిరూపమే బస్తీ దవాఖానాలు

-మరో 25 దవాఖానాలకు నేడు శ్రీకారం: తలసాని

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): జంటనగరాల్లో కొత్తగా మరో 25 బస్తీదవాఖానాలను శుక్రవారం ప్రారంభించనున్నట్టు పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ప్రభుత్వ వైద్యసేవలను ప్రజలకు చేరువ చేయాలనే ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు లక్ష్యమని అన్నారు. అందుకనుగుణంగా ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. బస్తీదవాఖానాల ద్వారా ప్రతి రోజూ సుమారు 14వేల మంది వైద్యసేవలను పొందుతున్నారని మంత్రి తెలిపారు. నూతనంగా 25 దవాఖానాల ప్రారంభంతో అదనంగా మరో 2వేల మందికి వైద్యసేవలు అందుతాయని ఆయన చెప్పారు.మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఆలోచనలలో నుంచి ఏర్పాటు అయినవే బస్తీదవాఖానాలని మంత్రి తలసాని తెలిపారు. వీటి పనితీరు పట్ల ఎంతో శ్రద్ధతో ఉన్నారని పేర్కొన్నారు. మున్సిపల్‌శాఖ మంత్రి కె. తారక రామారావు, హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ, డిప్యూటీస్పీకర్ పద్మారావు,ఆరోగ్యశాఖమంత్రి ఈటల రాజేందర్, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, శాసన మండలిలో ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డిప్యూటీ మేయర్ తదితరులు వీటిని ప్రారంభిస్తారని తెలిపారు. జీహెచ్‌ఎంసి పరిధికి సంబంధించి హైదరాబాద్ జిల్లాకు 95, రంగారెడ్డి జిల్లాపరిధిలో 32, మేడ్చల్ పరిధిలో 40, సంగారెడ్డిలో 3 చొప్పున ఇప్పటికే 170 బస్తీదవాఖానాలను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. ప్రస్తుతం పనిచేస్తున్న బస్తీదవాఖానాలకు అదనంగా హైదరాబాద్ జిల్లాలో 18, మేడ్చల్‌లో 2 చొప్పున మరో 25 బస్తీదవాఖానాల ప్రారంభంతో వాటి సంఖ్య 195కు చేరుతుందన్నారు.

జీహెచ్‌ఎంసి పరిధిలో 300 దవాఖానాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రజల అవసరాలను బట్టి రానున్న రోజుల్లో బరిన్నిబస్తీదవాఖానాలను ఏర్పాటు చేస్తామన్నారు. వేలాది రూపాయల ఖర్చుచేసి వైద్య చికిత్సలు పొందలేకపోతున్న పేద ప్రజలకు ఈ బస్తీ దవాఖానాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని అన్నారు.

కోవిడ్ మరణాల కోసం ప్రత్యేక గ్రేవ్‌యార్డు

-మంత్రి కొప్పులను కోరిన క్రిష్టియన్ సంఘాలు

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కోవిడ్‌తో మరణించే క్రిష్టియన్లకు ప్రత్యేక స్మశానం కోసం స్థలం కేటాయించాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమం, సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను క్రిస్టియన్ కమ్యూనిటీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంత్రిని కలసి పరిస్థితిని వివరించారు. ఇందులో కోవిడ్‌తో చనిపోయిన వారికి ప్రత్యేక స్మశాన వాటిక ఏర్పాటుకు భూమి కేటాయించాలని కోరారు. అలాగే ఇప్పటికే ప్రభుత్వం క్రిస్టియన్ గ్రేవ్‌యార్డుకోసం భూమి కేటాయిస్తామని ప్రకటించింది. దీనిపై కూడా వారు మంత్రితో చర్చించారు. క్రిస్టియన్‌లకు భూ కేటాయించే భూమిలో విషయంలో క్యాథలిక్‌లకు 30శాతం, ప్రొటెస్టంట్‌కమ్యూనిటీకి 70శాతం ప్రభుత్వం సిద్దంగా ఉందని, దీని కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవా లని మంత్రి సూచించారు. చర్చి మ్యారేజెస్ యాక్ట్-1872 ప్రకారం రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రస్తుతం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో యాక్ట్ అమలు జరుగుతోందని, దీనిని అన్నిజిల్లాలకు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్నికోరారు. దీంతో పాటు క్రిస్టియన్ కమ్యూనిటీకి సంబంధించిన వివిధ సమస్య లను వారు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై మంత్రి కొప్పుల సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ప్రభుత్వం ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు.

రైతు రాజ్యం నెలకొల్పిన సిఎం కెసిఆర్

-పసిడిపంటలతో తులతూగుతున్న గ్రామాలు: మంత్రి

నల్లగొండ,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ రైతు రాజ్యాన్ని నెలకొల్పేందుకు చేపట్టిన సాహసోపేతమైన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని విద్యుత్ శాఖా మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి తెలిపారు. కక్షలు, కార్పణ్యాలతో అట్టుడికి పోతున్న పల్లెల్లో నేడు పసిడి పంటలతో వర్ధిల్లు తున్నాయిన పేర్కొన్నారు. యాసంగి పంటల దిగుబడిలో యావత్ తెలంగాణ రాష్ట్రంలోనే ఉమ్మడి నల్గొండ జిల్లా సింహభాగంలో నిలుచోవడమే అందుకు నిదర్శనమన్నారు. కరోనా సంక్షోభంలోనూ రాష్ట్ర ప్రభుత్వం రైతుకు బాసటగా నిలిచిందని అన్నారు. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న వేళ పంట చేతికి రావడంతో ఏమి చెయ్యాలో తోచక దిక్కులు చూస్తున్న రైతాంగానికి సీఎం కేసీఆర్ అపన్నాహస్తం అందించారని చెప్పారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి, నల్లగొండ జిల్లా శాలిగౌరారం మార్కెట్ కమిటీల నూతన పాలక మండళ్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో మంత్రి జగదీష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్ప బలమే రైతుకు శ్రీరామరక్షగా నిలుస్తోందన్నారు. ఏండ్ల నాటి ఫ్లోరోసిస్ నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లా విముక్తి పొందింది కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే అని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ కంచర్ల రామకృష్ణా రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ గుజ్జ దీపికా యుగంధర్ రావు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రజాక్, ఇతర నేతలు పాల్గొన్నారు.

రాజ్యసభ ఉప ఎన్నికకు నిషాద్ నామినేషన్

ఏకగ్రీవంగా ఎన్నిక కానున్న బిజెపి అభ్యర్థి

లక్నో,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ ఉపఎన్నికకు బీజేపీ అభ్యర్థిగా జయప్రకాష్ నిషాద్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమక్షంలో నామినేషన్ వేశారు. ఎస్పీ నాయకుడు బెణిప్రసాద్ వర్మ మరణం తరువాత యూపీలో ఒక రాజ్యసభ సీటు ఖాళీ ఏర్పడింది. రాజ్యసభ ఉపఎన్నికకు నామినేషన్లు దాఖలు చేయడానికి గురువారమేఆఖరు రోజు. ప్రతిపక్ష పార్టీల నుంచి ఇంతవరకు ఏ ఒక్క అభ్యర్థి కూడా నామినేషన్ దాఖలు చేయకపోవడంతో జయప్రకాష్ నిషాద్ ఎన్నిక ఏకగ్రీవం కానున్నట్లు అధికారులు చెప్తున్నారు. అయితే, ఎన్నికల కమిషన్ ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం ఆగస్టు 24 న ఓటింగ్ జరుగుతుంది. జయప్రకాష్ నిషాద్ గోరఖ్‌పూర్ ప్రాంతానికి చెందిన బీజేపీ ఉపాధ్యక్షుడు. బహుజన్ సమాజ్ పార్టీ టికెట్‌పై 2012 లో చౌరిచోరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈయన పదవీకాలం 2022 మే 5 వరకు ఉన్నది. జయప్రకాష్ నిషాద్ 2018 లో బిజెపిలో చేరారు. ప్రతిపక్ష పార్టీలలో బ్రాహ్మణ ఓట్లపై ఘర్షణ మధ్య నిషాద్ అభ్యర్థిత్వాన్ని బీజేపీ ఖరారు చేసింది. వెనుకబడిన వారిలో పట్టును బలోపేతం చేయడంతోపాటు పూర్వంచల్ ప్రాంతంలో పార్టీకి బలం చేకూర్చే వ్యూహంలో భాగంగా నిషాద్‌ను రాజ్యసభ అభ్యర్థిగా నిలిపినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో 14 శాతం జనబా నిషాద్ సమాజానికి చెందిన వారు ఉండగా.. వారు గోరఖ్పూర్ తోపాటు కొన్ని పొరుగు సీట్లలో గణనీయమైన ప్రభావాన్ని చూపుతారని పరిశీలకులు చెప్తున్నారు.

ఉపాధ్యాయ శిక్షణలో ఇక సమూల మార్పులు

నూతన విద్యావిధానానికి అనుగుణంగా కోర్సులు

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): నూతన విద్యావిధానం ప్రకటనతో మరోమారు టీచర్ల సామర్థ్యంపైనా చర్చ సాగుతోంది. ఇకనుంచి శిక్షకులైన వారికే టీచర్లుగా అవకాశం ఇస్తారు. ప్రైవేట్ రంగంలోనూ ఇకముందు పూర్తిస్థాయి శిక్షణ పొందిన వారే ఉపాధ్యాయులుగా పనిచేసే వీలుంటుంది. ప్రభుత్వంతోపాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులుగా పనిచేయాలంటే కచ్చితంగా బీఎడ్ ఉండాల్సిందే.

నూతన విద్యావిధానం ప్రకారం 2021-22లో అన్ని ప్రభుత్వ డైట్ కళాశాలల్లో ఇంటిగ్రేటెడ్ బీఎడ్ కోర్సు అందుబాటులోకి రానుంది. ఇంటర్మీడియేట్ అర్హతతోనే ఈ కోర్సులో విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఎన్సీటీఈ, ఎన్ఈఆర్టీ ఆధ్వర్యంలో సిలబస్(కరిక్యులమ్), పెడగాజీని సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రత్యేక ఎడ్సెట్తో ఇందులో ప్రవేశాలు కల్పిస్తారు.

దేశవ్యాప్తంగా పుట్టగొడు గులా వస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో ఉపాధ్యాయుల నియామకంలో బోధన నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా బీఎడ్ డిగ్రీ ఉంటేచాలు అనే విధంగా చాలా సంస్థలు వ్యవహరిస్తున్నట్లు పలు సర్వేలు వెల్లడించిన విషయం విదితవే. ఈ పరిస్థితిని సమూలంగా మార్పు చేయాలనే నూతన విధానంలో భాగంగా ఇంటిగ్రేడ్ బీఎడ్ను అందుబాటులోకి తెస్తున్నారు. దేశంలో 2030నాటికి పాఠశాల విద్యా బోధనకు కనీస అర్హతగా నాలుగేళ్ల ఇంటిగ్రేడ్ బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను పరిగణలోకి తీసుకోవాలని నూతన విద్యావిధానంలో సూచించారు. నాలుగేళ్ల కోర్సు చదివేవారికి విస్తృతమైన పరిధిలో శిక్షణ అందించవచ్చని భావిస్తున్నారు. ఇక బీటెక్ వంటి నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసినవారు, వివిధ పీజీ కోర్సులు పూర్తి చేసినవారు ఒక సంవత్సరం బీఎడ్ చేయడానికి అవకాశం కల్పించారు. తర్వాత పీజీలో తమ ప్రత్యేక సబ్జెక్టును పరిగణలోకి తీసుకుని ప్రత్యేక ఉపాధ్యాయునిగా వెళ్లవచ్చు. మరో వైపు ఇన్సర్వీస్లో ఈ కోర్సులో చేరేవారికి ఆన్లైన్, ఆఫ్లైన్లో నిర్వహించే అవకాశం కల్పించారు. ఉపాధ్యాయులుగా రాణించాలంటే ఉపాధ్యాయ విద్య విధిగా చదవాల్సిందే. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయ విద్య డీఎడ్, బీఎడ్ కోర్సుల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దానిలో భాగంగా గతంలో ఏడాది ఉన్న ఈ కోర్సులు రెండేళ్లుగా మారింది. సుప్రీం కోర్టు నియమించిన జేఎస్.వర్మ కమిషన్ నివేదిక ప్రకారం కొన్ని కళాశాలలు నాణ్యతతో కూడిన విద్యనందించడంలో విఫలమవుతూ వస్తున్నాయని, ప్రమాణాలు లేకుండానే డీఎడ్, బీఎడ్ డిగ్రీలు పొంది ఎలాంటి అవగాహన, కనీస సామర్థ్యాలు లేకుండా ఉంటున్నారని సూచించారు. దీంతో నాణ్యమైన ఉపాధ్యాయ విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని పలు అంశాలను పేర్కొంటూ కీలక మార్పులు చేసి ఇంటిగ్రేటెడ్ నాలుగేళ్ల బీఎడ్ను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న రెండేళ్ల బీఎడ్ కోర్సు 2030 వరకు కొనసాగుతుంది. తర్వాత నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఎడ్ అందుబాటులోకి వస్తుంది.

సిద్దిపేటలో అందుబాటులోకి కరోనా టెస్ట్ ల్యాబ్

సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సా÷-పల్లి పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్టీపీసీఆర్ ల్యాబ్ని ప్రారంభించిన మంత్రి హరీస్ రావు.

మెడికల్ కాలేజీలో ప్రారంభించిన మంత్రి హరీష్ రావు
కరోనా జయించిన వారు ప్లాస్మా దానం చేయాలని హితవు

సిద్దిపేట,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కరోనాను జయించిన వ్యక్తులు..ప్లాస్మా దానానికి ముందుకు రావాలని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. అలాగే కరోనా సోకిన వారు ధైర్యంగా ఉండాలన్నారు. జిల్లాలోని సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్పల్లి పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్టీపీసీఆర్ ల్యాబ్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..ప్లాస్మా దానంతో బాధితుల ప్రాణాలను కాపాడు కోవచ్చన్నారు. అలాగే ప్లాస్మా దానం చేసే వ్యక్తుల్లో మెటబాలిజం మెరుగవుతుందని తెలిపారు. కరోనాను జయించిన వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రాణాలు కాపాడాలని మంత్రి పిలుపునిచ్చారు. కరోనా రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ప్రజల్లో మనోధైర్యం, ఆత్మవిశ్వాసం కల్పించి.. నేను ఉన్నాననే భరోసా ఇవ్వడానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్రావు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా సిద్దిపేట పట్టణ ప్రజలకు కరోనా టెస్టులు చేయడానికి మొబైల్ టెస్టింగ్ ల్యాబ్ బస్సును అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తొలిసారిగా సిద్దిపేట మెడికల్ కళాశాలకు ఇండియా కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ అనుమతి లభించింది. ఇక నుంచి కరోనా వైద్య పరీక్షల నమూనాలను హైదరాబాద్కు పంపించే అవసరం లేకుండానే టెస్టు చేయించుకున్న 8 గంటల్లోనే సిద్దిపేట మెడికల్ కళాశాలలో ఫలితాలు రానున్నాయి. సిద్దిపేట మెడికల్ కళాశాలలోని నూతన భవనంలో మొబైల్ టెస్టింగ్ ల్యాబ్ను శుక్రవారం మంత్రి హరీశ్రావు ప్రారంభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ వ్యాప్తంగా జోరుగా వానలు

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ముసురు
పలుచోట్ల పొంగుతున్న వాగులు,వంకలు

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో విస్తారంగా వర్షాలు పడనున్నాయి. మరోమూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడనున్నాయి. అలాగే ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ముసురువాన పడుతోంది. అక్కడక్కడా భారీ వర్షాలతో వాగులు వంకలు పొంగుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. ముసురువానకు ఇండ్ల నుంచి బయటకెళ్లే పరిస్థితి లేకపోవడంతో రోజువారి కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడింది. చెరువులు, కుంటల్లోకి వరద పెరుగుతోంది. ఇప్పటికే కొన్ని చెరువులు నిండి అలుగుపోసేందుకు సిద్ధంగా ఉండగా, మరికొన్ని నిండుతున్నాయి. చాలావరకు వరినాట్లు పూర్తికాగా, ముసురువానతో మెట్ట పంటలకు ఊపిరి పోసినట్లయ్యింది. పత్తి, కందులు, పెసర తదితర పంటలకు ఢోకా ఉండదని అన్నదాతలు ఆనందపడుతున్నారు. హైదరాబాద్ లో కురుస్తున్న భారీ వర్షంతో మూసీ పోటెత్తుతోంది. మరో రెండురోజులు వానలు ఉంటాయని వాతావరణ అధికారులు పేర్కొన్నారు. తుఫాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న ముసురుతో జిల్లా రైతాంగం ఆనందోత్సాహం వ్యక్తం చేస్తున్నారు. మెట్ట పంటలైన పత్తి, కంది, పెసర, నువ్వులకు కురుస్తున్న వర్షాలు జీవం పోసినట్లయ్యింది. వరి సాగుకు రైతులు దుక్కుల దున్నకం పనులు ముమ్మరంగా చేస్తున్నారు. బోరు, బావుల కింద సాగు చేస్తున్న రైతులు నాట్లు వేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో 12 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఖమ్మంలోని మున్నేరు ఉగ్రరూపం దాల్చింది. జనగామ మినహా ఉమ్మడి వరంగల్ జిల్లాలో వర్షం దంచికొట్టింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పెద్దవాగు, చెలివెల, సింగంపల్లి, మోరంచ వాగులు పొంగిపొర్లుతున్నాయి. గణపురం మండలంలో ఆర్టీసీ బస్సుపై చెట్టు కూలడంతో కండక్టర్కు స్వల్ప గాయాలయ్యాయి. భూపాలపల్లి సింగరేణి ఏరియాలో సంస్థకు రూ.4.12 కోట్ల నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. ములుగు జిల్లాలో జంపన్నవాగు ఉధృతి పెరిగింది. కరీంనగర్ జిల్లాలో 228 మత్తళ్లు దుంకుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని కూడెల్లి, కామారెడ్డి జిల్లా పాల్వంచ వాగులు పొంగిపొర్లుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ నగరంపై ముసురు ముసుగేసింది. పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిశాయి. వికారాబాద్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని ప్రాజెక్టులు నిండు కుండలను తలపిస్తున్నాయి. జిల్లాలో పెద్ద ప్రాజెక్టుగా ఉన్న కోట్పల్లి ప్రాజెక్టు అలుగు పారడంతో నీటి ప్రవాహంతో నాగసమందర్ - వికారాబాద్ జిల్లా కేంద్రానికి మధ్యలో కల్వర్టు కొట్టుకుపోయింది. అటు తాండూర్ - వికారాబాద్ మధ్యలోని మంచన్ పల్లి దగ్గర ప్రధాన రహదారి కల్వర్టు కొట్టుకపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

దేశానికి ఆదర్శంగా తెలంగాణ వ్యవసాయం

మత్స్యకారులను అదుకునేలా ఉచిత చేపపిల్లల పంపిణీ
పలు పథకాలతో పురోగమిస్తున్న తెలంగాణ: ఎర్రబెల్లి

వరంగల్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): తెలంగాణ వ్యవసాయం దేశానికే ఆదర్శంగా నిలిచిందని గ్రామాణీభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తెలంగాణ వ్యవసాయం దేశానికి గర్వకారణమని అన్నారు. అలాగే కరోనా సంక్షోభాన్ని ఎదుర్కొన్న రాష్ట్రం కూడా తెలంగాణ అని అన్నారు. ఇవన్నీ గర్వంగా చెప్పుకోక తప్పదన్నారు. కరోనా కష్టకాలంలో రైతులను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్సే అన్నారు. మంత్రి ఎర్రబెల్లి శాయంపేట మండలంలో పర్యటించారు. కొత్తగట్టు సింగారం గ్రామంలో పంచాయతీ కార్యాలయం భవనాన్ని ప్రారంభించిన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ..పల్లెల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ప్లలె ప్రగతి వంటి కార్యక్రమాలు చేపట్టి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారన్నారు. గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి చివరిగింజ వరకు ధాన్యం కొనుగోలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. ఈ కష్టకాలంలోనూ రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఎరువులు,విత్తనాలు సకాలంలో అందించటమే కాకుండా కాల్వల ద్వారా సాగునీరు అందించిన రైతు బాంధవుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. కష్టాల్లోనూ సంతోషంగా ఉన్నది తెలంగాణ రైతాంగమే అని అన్నారు. రైతుల సంక్షేమం ముఖ్యమంత్రి కేసీఆర్తోనే సాధ్యమని, రాబోయే రోజుల్లో రైతులు పండించిన పంటలకు వారే ధర నిర్ణయించనున్నారని అన్నారు. నియంత్రిత సాగుతో రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు రానున్నాయని అన్నారు. రైతులను సంఘటితం చేయటానికి రైతు వేదికలు ఏర్పాటు చేస్తున్నా మన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల సంక్షేమం కోసం పని చేయాలని అన్నారు. అలాగే మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకే తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అందజేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన చేప పిల్లలను చెరువుల్లో వదులుతున్నామని చెప్పారు. మత్స్యకారులను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఐదేండ్ల నుంచి సబ్సిడీపై చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే వలలు, టీవీఎస్ వాహనాలు, చేపలు తీసుకెళ్లేందుకు వాహనాలను సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రమాదవశాత్తు మత్స్యకారులు మృతి చెందితే రూ.6లక్షల ఎక్స్గ్రేషియాను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా అన్ని వర్గాల్లో సంపదను సృష్టించాలనే ఆలోచనలతోనే సీఎం కేసీఆర్ పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు కుల సంఘాలకు ప్రాధాన్యమిస్తుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, జిల్లా కలెక్టర్ హరిత, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కరోనాతో ఘజియాబాద్ మాజీ ఎంపి మృతి

న్యూఢిల్లీ,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కరోనా బారినపడి చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నాయకుడు, ఘజియాబాద్ మాజీ ఎంపీ సురేంద్ర ప్రకాశ్ గోయెల్ శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతికి విశ్రాంత కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ జనరల్ వీకే సింగ్ సంతాపం తెలిపారు. 'సురేశ్ ప్రకాశ్ సింగ్ మృతి తీవ్రంగా కలచివేసింది. ఎంపీగా ఆయన ఘజియాబాద్కు ఎనలేని సేవలందించారు. ఆయన మృతి తీరని లోటు. సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలి' అని ట్విట్టర్లో పేర్కొన్నారు. గోయల్ మృతికి ఉత్తరప్రదేశ్కు చెందిన పలువురు కాంగ్రెస్ ముఖ్యనాయకులు సైతం సంతాపం ప్రకటించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

ఎన్ఎస్యూఐ నాయకుల అరెస్ట్ అక్రమం

భూపాలపల్లిటౌన్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): ప్రవేశ పరీక్ష సెట్లను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతి భవన్ను ముట్టడించిన ఎన్ఎస్యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఇతర నాయకులను అరెస్టుచేయడం పై నిరసన ఎన్ఎస్యూఐ జిల్లా నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భట్టు కరుణాకర్ మాట్లాడుతూ ప్రవేశ పరీక్షల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయడం సరికాదన్నారు. దీనిపై నిరసన తెలిపిన విద్యార్థి సంఘం నేతలను అరెస్టు చేయడం అమానుషమని విమర్శించారు. ఇదిలావుంటే భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్లో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను ఎన్ఎస్యూఐ నాయకులు దహనం చేశారు.

వారం రోజుల వ్యవధిలో భార్యా భర్తల మృతి

కరోనా చికిత్స పొందుతూ భార్య మరణం
ఆందోళనలో కుటుంబీకులు

కామారెడ్డి,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కామారెడ్డి జిల్లాలోని పంచముఖి కాలనీలో విషాదం చోటు చేసుకుంది. వారం రోజుల్లో భార్యాభర్తలు మృతి చెందారు. కరోనా లక్షణాలతో హోం క్వారంటెన్లో ఉన్న రాజేష్(35) అనే యువకుడు.. బాత్ రూంలో జారిపడి ఈనెల 7న మృతి చెందగా... కరోనాతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భార్య ప్రవంతి(30)మృతి చెందింది. మృతుడు రాజేష్ కూతురు, అతడి తల్లికి కూడా కరోనా పాజిటివ్గా నిర్ధారణ అయ్యింది. రాజేష్ అంత్యక్రియలకు హాజరైన మరో ఆరుగురు బంధువులకూ కరోనా సోకింది. దీంతో అంత్యక్రియలకు హాజరైన 70 మంది బంధువులు, స్నేహితుల్లో ఆందోళన నెలకొంది.

పట్టణంలోని పంచముఖి హనుమాన్ కాలనీలో నివాసముంటున్న మహిళకు ఇటీవల కరోనా లక్షణాలు ఉండడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలుస్తోంది. అయితే గతవారం రోజుల కిందట మహిళ భర్త మరణించడంతో అనుమానిత మృతిగా భావించి కుటుంబసభ్యులకు పరీక్షలు నిర్వహించగా వారిలో పలువురికి కరోనా పాజిటివ్గా నిర్ధారణ అయినట్లు సమాచారం. అందులో ప్రస్తుతం మరణించిన మహిళ కూడా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్లోని ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబీకులు తీసుకెళ్లినట్లు, అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మరణించినట్లు సమాచారం.

పరిసరాల పరిశుభ్రతపై అధికారుల ప్రమాణం

రంగారెడ్డి,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ప్రమాణం చేశారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు దీనిని చేపట్టారు. షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ముందు రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని.. డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రమాణం చేశారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాలలు, గ్రామాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, రైల్వే స్టేషన్ లు, బస్ స్టాండ్ లు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయా లలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త ఎక్కడ వేయకూడదని ఏర్పాటు చేసిన చెత్త బుట్టల్లోనే చెత్తను వేయాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదేశాలను ప్రజలందరూ పాటించాలన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అసలే వర్షాలకాలం కాబట్టి ప్రజలు నివసించే పరిసర ప్రాంతాల్లో ఈగలు, దోమలు,బెడద లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితులకు మరణశిక్ష

కేసు దర్యాప్తు చేసిన పోలీసుల సంబరాలు

ముంబై,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): ఒక బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఇద్దరు నిందితులకు కోర్టు మరణశిక్ష విధించింది. దీంతో సంబంధిత పోలీసులు పోలీస్స్టేషన్లో సంబరాలు జరుపుకున్నారు. మహారాష్ట్ర బుల్దానాలోని చిఖ్లిలో గురువారం ఈ ఘటన జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన 9 ఏండ్ల బాలికపై ఇద్దరు వ్యక్తులు లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ కేసుపై విచారణ జరిపిన స్థానిక సెషన్స్ కోర్టు ఆ ఇద్దరు నిందితులను దోషులుగా నిర్ధారించడంతోపాటు మరణశిక్షను విధించింది. మరోవైపు ఈ కేసు దర్యాప్తు కోసం చాలా శ్రమించిన చిఖ్లి పోలీసులు కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి పోలీస్స్టేషన్ ఎదుట పటాకులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. బాధిత బాలికకు న్యాయం జరుగడంపై తాము చాలా సంతోషంగా ఉన్నామని చిఖ్లి పోలీస్స్టేషన్ అధికారులు తెలిపారు.

మేడ్చల్లో అధునాతన పబ్లిక్ టాయిలెట్స్

15 నాటికి అందుబాటులో వస్తాయన్న కలెక్టర్

మేడ్చల్ మల్కాజిగిరి, ఆగస్ట్14 (ఆర్ఎన్ఎ): పట్టణాలను బహిరంగ మల, మూత్ర విసర్జన రహితంగా రూపొందించేందుకు జిల్లాలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆగస్టు 15 నాటికి అన్నికార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ప్రతి వెయ్యి మందికి కనీసం ఒక టాయిలెట్ చొప్పున నిర్మించాలని రాష్ట్ర మున్సిపల్శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టమైన ఆదేశాలుజారీ చేయడంతో జిల్లాలో పబ్లిక్టాయిలెట్స్ నిర్మాణం ముమ్మరంగా చేపట్టారు. జిల్లాలో 4 కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు ఉండగా జనాభా ప్రాతిపదికన ప్రతి వెయ్యి మందికి ఒక టాయిలెట్ చొప్పున పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించేందుకు జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతులు జారీ చేశారు. నూతనంగా 310 మరుగుదొడ్లు నిర్మించేందుకు అందులో 96 షీ టాయిలెట్స్ నిర్మించేందుకు అనుమతించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలన్నింటినీ పరిశుభ్ర నగరాలుగా , బహిరంగ మల మూత్ర రహిత నగరాలుగా (ఓడీఎఫ్) చేసేందుకు ఇప్పటికే పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. దీంతో పాటు నగరాల్లోని ప్రజలు, వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు బయటకు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండేందుకు పెద్దయెత్తున టాయిలెట్లను నిర్మించాలని అన్ని మున్సిపాలిటీలను ప్రభుత్వం ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లోనూ స్వచ్ఛ సౌశయాల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లాలో 15వ తేదీ నాటికి 55 మరుగుదొడ్లు అందుబాటులోకి వస్తాయని జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు తెలిపారు.

బెంగుళూరు హింసాకాండలో చర్యలు

పలువురిని అరెస్ట్ చేసిన పోలీసులు

బెంగళూరు,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జరిగిన హింసాకాండలో పోలీసుల చర్యలు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ కార్పొరేటర్ ఇర్షాద్ బేగం భర్త కలీం పాషను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కలీం పాషపై హింసకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయని పోలీసులు తెలిపారు. కలీం పాష నాగ్వరా వార్డు కార్పొరేటర్ ఇర్షాద్ బేగం భర్త. తాజాగా ఈ ఘటనపై మరో 60 మందిని అరెస్టు చేయగా ఇప్పటివరకు మొత్తం 206 మందిని అదుపులోకి తీసుకున్నట్లు బెంగళూరు పోలీస్ కమిషనర్ సందీప్ పాటిల్ చెప్పారు. ఈ అరెస్టు తరువాత హింసాకాండలో కాంగ్రెస్ పాత్ర బహిర్గతమైందని మంత్రి సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హింసకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ కార్పొరేటర్ భర్తను పోలీసులు అరెస్ట్ చేశారని ఆయన తెలిపారు. ఓ ఫేస్బుక్ పోస్టుపై బెంగళూరులో హింస చెలరేగిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీనివాస్ మూర్తి ఇల్లు, పోలీస్ స్టేషన్పై మూకా దాడి చేసినప్పుడు ముగ్గురు మరణించగా, 60 మందికి పైగా పోలీసులు గాయపడ్డారు. 250 వాహనాలను అల్లరి మూకలు తగులబెట్టినట్లు పోలీసులు తెలిపారు. అభ్యంతరకరమైన పోస్ట్ రాసిన వ్యక్తి ఎమ్మెల్యే దగ్గర ఉండగా అతడిని పోలీసులు అరెస్టు చేశారు.

అమరావతి కూడా రాష్ట్రంలో అంతర్భాగం

దీన్ని అభివృద్ధి చేయాలన్నదే సిఎం జగన్ సంకల్పం
కోర్టుల ద్వారా అభివృద్ధిని అడ్డుకుంటున్న విపక్షం
మంత్రి బొత్స సత్యనారాయణ

అమరావతి,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): అమరావతి ప్రాంతం రాష్ట్రంలో అంతర్భాగమని దానిని కూడా అభివృద్ధి చేసి చూపుతామని రాష్ట్ర మున్సిపల్,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. శాసనసభ ఆవరణలో గురువారం శాసన మండలి అభ్యర్థి పెనుమత్స సూర్యనారాయణ రాజు(సురేష్ బాబు) నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మంత్రి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమరావతి మెట్రోపాలిటిన్ ఏరియా డెవలప్ అథారిటీ (ఏఎంఆర్డిఏ) అంశంపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. అమరావతిలో ప్రస్తుతం ఏయే దశల్లో నిర్మాణాలు ఉన్నాయో అధికారులను సిఎం జగన్ అడిగితెలుసుకున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ వివరించారు. నిధుల సమీకరణకు ప్రణాళిక సిద్ధంచేసుకోవాలని, ఆర్థికశాఖ అధికారులతో కలిసి కూర్చుని ప్లాన్ చేసుకోవాలని సీఎం ఆదేశించారని తెలిపారు. హాపీ నెస్ట్ బిల్డింగులను పూర్తిచేయాలని సిఎం సూచించారన్నారు. వాటిని పూర్తిచేసే కార్యాచరణపై అధికారులతో సీఎం చర్చించినట్లు మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

ప్రభుత్వం మూడు రాజధానుల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తుందని వెల్లడించారు. అన్ని ప్రాంతాలు సమాన అభివృద్ధికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. అమరావతి ప్రాంతం ఈ రాష్ట్రంలో అంతర్భాగమేనని గుర్తు చేశారు. అమరావతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సిఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు.రాష్ట్ర ఆర్థికపరిస్థితిని దృష్టిలో పెట్టుకొని రైతులకు రిటన్ ఎ÷-లాట్లు ఇచ్చి అభివృద్ధి చేస్తామన్నారు.రాష్ట్రంలో అధికార,ప్రతిపక్షం మొత్తం తామేనని మంత్రి చమత్కరించారు. చంద్రబాబు ప్రతిపక్ష బాధ్యతను విస్మరించారని మంత్రి విమర్శించారు. సిఆర్డిఏ చట్టం రద్దును, పరిపాలన వికేంద్రీకరణ బిల్లును గవర్నర్ ఆమోదించాకే శంఖుస్థాపన చేయాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయించారని తెలిపారు. ప్రతిపక్షాలు కోర్టు ద్వారా ప్రభుత్వ చర్యలకు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలో నిర్మాణ దశలో అసంపూర్తి భవనాలను పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ ప్రాంత రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలందరికీ నమ్మకం కలిగేలా అమరావతిని అభివృద్ధి చేసి చూపుతామని తెలిపారు. అమరావతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూనే,అక్కడ నిర్మించిన భవనాలను ఏం చేయాలి, ఎందుకు ఉపయోగించాలి అన్నది ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు. ప్రతిపక్షం మాటలను నమ్మవద్దని, లేనిపోని అనుమానాలను పెట్టికోవద్దని ప్రజలకు మంత్రి సూచించారు. త్వరలో నూతన రాజధాని పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో శుభకార్యాలు జరిగేటప్పుడు అందరికీ చెప్పి చేయడం హిందూ సాంప్రదాయమని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమానికి దేశ ప్రధానమంత్రి ని, దేశంలోని పెద్దలను అందరినీ పిలుస్తామని స్పష్టంచేశారు.అన్ని రాష్ట్రాల వారికి ఆహ్వాన పత్రాలను అందజేస్తామని మంత్రి వెల్లడించారు.సమావేశంలో మంత్రి వెంట ఎమ్మెల్యేలు కోరుముట్ల శ్రీనివాసులు,కరణం ధర్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఒక లక్ష ఆటోల్లో భద్రతలను ఏర్పాటు చేసేందుకు భాగస్వామ్యం కుదుర్చుకున్న ఉబర్, బజాజ్



న్యూఢిల్లీ, ఆగష్టు 14: దేశ వ్యాప్తంగా ఒక లక్ష ఆటోల్లో భద్రతా విభజనను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించాయి ఉబర్ బజాజ్. దీనివల్ల డ్రైవర్లు, రైడర్ల మధ్య రక్షణ అవరోధంగా పనిచేయడంతో. భౌతిక దూరాన్ని పాటించే అవకాశం లభిస్తుంది.

ఫేస్ మాస్కులు, సానిటైజర్లు క్రిమి సంహారక మందులతో కూడిన సేఫ్టీ కిట్ను న్యూఢిల్లీ, గుర్గావ్, ముంబై, పూణే, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, మైసూర్, మధురై వంటి 20 నగరాల్లో దాదాపు ఒక లక్ష ఆటో డ్రైవర్లకు ఇప్పుడు పంపిణీ చేయనున్నారు. అలాగే వారిఆటో రిక్షాల కోసం పిపిఇ, వినియోగంపై ఉబర్ యాప్ ద్వారా డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణా అందించడానికి ఉబెర్ సాంకేతికతను ఉపయోగిస్తోందని ఈ సందర్భంగా ఉబర్ ఎపిఐసి బిజినెస్ డెవలప్మెంట్ డైరెక్టర్ నందిని మహేశ్వరి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఉబెర్ సెవలను తిరిగి ప్రారంభించినప్పుడు, మేము అందరి కంటే ముందు ఉండాలని కోరుకున్నాము. అలాగే లక్షలాది మంది మారైడర్లకు సురక్షితమైన నమ్మదగిన రవాణాను అందించేందుకు సిద్ధంగా ఉన్నాము. 'న్యూ నార్మల్' దేశంలో అత్యంత విశ్వసనీయ గౌరవనీయమైన బ్రాండ్లలో ఒకటైన బజాజ్తో మాభాగస్వామ్యం, మాప్లాట్ ఫారమ్ను ఉపయోగించే ప్రతి ఒక్కరి భద్రత పై మానిబద్ధతను సూచిస్తుంది. రాబోయే కొద్దినెలల్లో, మాడ్రైవర్ భాగస్వాముల విశ్వాసం కలిగించడానికి లక్షలాదిమంది మారైడర్లకు మనశ్శాంతిని అందించడానికి మాదగ్గిరి సంబంధాలను పెంచుకుంటాము అని అన్నారు. ఈ సందర్భంగా ఉబర్-బజాజ్ భాగస్వామ్యం గురించి బజాజ్ ఆటో ఇంట్రా-సిటీ బిజినెస్ ప్రెసిడెంట్ సమర్దీప్ సుబంద్. ఆయన మాట్లాడుతూ.. మనదేశం లాక్డౌన్కు సడలింపులు ఇచ్చినప్పుడు బజాజ్ ఆటోకలిగిన ప్రతీ డ్రైవర్ వారి వినియోగదారులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించాలని కోరుకున్నాం. అందుకు మేం కూడా సహాయపడాలని భావించాం. అందుకే వాహనాలతో సంబంధం లేకుండా భద్రతా విభజనలను స్థాపించడానికి క్రిమిసంహారక వస్తు సామగ్రిని అందించడానికి సిద్ధంగా ఉన్నాం. అందులో భాగంగా మేము 1 లక్షలకు పైగా డ్రైవర్లను ఇవి చేర వేస్తున్నాము అని అన్నారు ఆయన.

జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట హాజరైన పొట్లూరి

హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): కిడ్నాప్ కేసుతో పాటు మరో కేసులో వ్యాపారవేత్త,వైకాపా నేత పొట్లూరు వరప్రసాద్ (పీవీపీ) జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. 2019 సెప్టెంబర్ 16న పీవీపీ కార్యాలయంలో పనిచేసిన మేనేజర్ తిమ్మారెడ్డిని కిడ్నాప్ చేశారంటూ అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పొట్లూరు వరప్రసాద్పై ఏ1 నిందితుడిగా కేసు నమోదు చేశారు. తర్వాత కొద్ది రోజుల క్రితం బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో ఓ విల్లాకు సంబంధించిన గొడవలో విల్లాకు చెందినవారు పీవీపీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను ప్రశ్నించేందుకు పోలీసులు ఇంటికి వెళ్లిన సమయంలో పీవీపీ కుటుంబసభ్యులు పోలీసులపై కుక్కలను వదిలారు. ఈ విషయాన్ని పోలీస్ కమిషనర్ సీరియస్గా తీసుకున్నారు. పీవీపీపై పోలీసులు దర్యాప్తు చేస్తున్న సమయంలో ఆయన విజయవాడ వెళ్లిపోయారు. తర్వాత తెలంగాణ హైకోర్టులో మధ్యంతర బెయిల్ పొందారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
Editor: B. Devadas, Cell: 9000065433
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.